aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTV NETWORK

www.mahaaprabha.com

నమస్తే
మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

సోమవారం
19-10-2026 సంపుటి:01 సంచిక:208 పేజీలు:08 వెల:₹5/-

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA. తెలంగాణ NAMASTEY MAHAAPRABHA TGTEL/26/A0738 mahaaprabha.com Email : info@mahaaprabha.com

రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ల విరుచుకుపాటు!

- చమురు టెర్మినళ్లు, ఇంధన నిల్వ కేంద్రాలే లక్ష్యం
- పారిశ్రామిక సంస్థలు, డేటా కేంద్రాలపైనా దాడులు
- మృతి.. ఐదుగురికి గాయాలు
- 1,015 డ్రోన్లను కూల్చివేశామని రష్యా ప్రకటన
- మంటల్లో చమురు నిల్వ కేంద్రాలు
- జపోరిజియాపై రష్యా ప్రతీకార దాడులు
- ఉక్రెయిన్‌లో మహిళ మృతి.. ఇద్దరికి గాయాలు



రష్యా--ఉక్రెయిన్ యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చింది. రష్యాలోని చమురు ఎగుమతి టెర్మినళ్లు, ఇంధన నిల్వ కేంద్రాలు, పారిశ్రామిక సంస్థలు, డేటా కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ వెయ్యికిపైగా డ్రోన్లతో భారీ వైమానిక దాడి చేపట్టినట్లు నివేదికలు వెల్లడించాయి. ఈ దాడుల్లో ఒకరు మృతి చెందగా, ఐదుగురు గాయపడ్డారు. 1,015 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా ప్రకటించింది. మరోవైపు ఉక్రెయిన్‌లోని జపోరిజియాపై రష్యా జరిపిన ప్రతిదాడుల్లో ఓ మహిళ ప్రాణాలు కోల్పోగా, ఇద్దరు గాయపడ్డారు. ఇరు దేశాల పరస్పర దాడులతో యుద్ధం మరింత సంక్లిష్టంగా మారుతోంది.

కీవ్/మాస్కో

రష్యా--ఉక్రెయిన్ యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చింది. రష్యాలోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ భారీ స్థాయిలో డ్రోన్ దాడులు చేపట్టింది. ఆదివారం జరిగిన ఈ దాడుల్లో వెయ్యికిపైగా డ్రోన్లను ప్రయోగించినట్లు నివేదికలు వెల్లడించాయి. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఉక్రెయిన్ చేపట్టిన అతిపెద్ద వైమానిక దాడుల్లో ఇదొకటిగా రక్షణ

-మిగతా 3 లో



ఈ నెల 23న దేశవ్యాప్తంగా ప్రజామార్చ్!

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు కూటమి డిమాండ్
- పీపుల్ అగైనెస్ట్ సర్' ఆధ్వర్యంలో నిరసనలకు పిలుపు
- సర్ ప్రక్రియను రద్దు చేయాలని ప్రధాన డిమాండ్
- తొలగించిన ఓట్లను తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి
- రైతులు, యువత, కార్మికులు, విద్యార్థులు పాల్గొనాలని పిలుపు
- 'హర్ హాత్ మే తిరంగా' నినాదంతో ఉద్యమం
- కూటమిలో నటుడు ప్రకాశ్ రాజ్ సహా పలువురు నేతలు

నింగినంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు

ట్యాంక్‌బండ్‌పై వైభవంగా రాష్ట్రస్థాయి బతుకమ్మ వేడుకలు

- అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ!
- గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు, మంత్రుల హాజరు
- విజయ్ దేవరకొండ, రష్మిక జంట ప్రత్యేక ఆకర్షణ
- 700 మంది కళాకారులు, 700 మంది కిపైగా మహిళలతో మహా ర్యాలీ
- బతుకమ్మ ఆటపాటలు, జానపద ప్రదర్శనలతో పండుగ సందడి
- జలవనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: గవర్నర్
- వర్షపు నీటిని ఒడిసిపట్టి.. భూగర్భ జలాలను పెంచాలి
- తెలంగాణ జానపదాలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు: మంత్రి జూపల్లి

హైదరాబాద్, అక్టోబర్ 18 మహాప్రభ

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ సంబురాలు రాష్ట్రవ్యాప్తంగా అంబరాన్నంటాయి. పూలను పూజిస్తూ, ఆటపాటలతో మహిళలు ఉత్సాహంగా జరుపుకున్న వేడుకలు తెలంగాణ పల్లె సంస్కృతిని నగర వీధుల్లో ఆవిష్కరించాయి. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.అమరవీరుల స్మారకం నుంచి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో నిర్వహించిన మహా బతుకమ్మ ర్యాలీలో సుమారు 700 మంది

-మిగతా 3 లో





ఇటు ఉచిత ప్రయాణం.. అటు దోపిడీ!

- పండుగ ప్రత్యేక బస్సుల్లో భారీగా చార్జీల పెంపు
- మహిళలకు ఉచిత ప్రయాణం.. పురుషులకు రెట్టింపు వసూలు
- ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం
- ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని విమర్శ
- పెంచిన చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- పండుగ ప్రత్యేక బస్సుల అదనపు వసూళ్లను రద్దు చేయాలి
- సాధారణ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని సూచన
- ప్రభుత్వానికి 'ఎక్స్' వేదికగా హరీశ్‌రావు విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబర్ 18 మహాప్రభ

బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో చార్జీలను భారీగా పెంచడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని చెబుతూనే, పురుషుల నుంచి రెట్టింపు చార్జీలు వసూలు చేస్తూ ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. పండుగల సమయంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక బస్సులు నడుపుతున్నప్పటికీ, అధిక చార్జీలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ఒకవైపు మహిళలకు ఉచిత

-మిగతా 3 లో



భారత్‌దే సిరీస్!

- రెండో టీ20లోనూ జింబాబ్వే చిత్తు
- చెలరేగిన స్మృతి, షెఫాలీ
- విజృంభించిన బౌలర్లు
- 9 వికెట్లతో టీమిండియా ఘన విజయం
- మహిళల పొట్టి సిరీస్

తీవ్ర ఉద్రిక్తంగా ఫ్రాన్స్ నిరసనలు..

- 143 ఏళ్ల నాటి చారిత్రక టౌన్‌హాల్ భవనానికి నిప్పు..!
- పెరుగుతున్న జీవన వ్యయానికి వ్యతిరేకంగా ఆందోళనలు
- మోజెస్ టౌన్‌హాల్‌పై ముసుగులు ధరించిన నిరసనకారుల దాడి
- భవనం బయటి భాగంలో మూడింట రెండొంతులు ధ్వంసం
- పారిస్ సహా పలు నగరాలకు విస్తరించిన హింస
- దేశవ్యాప్తంగా 1,200 మందిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడి
- 150 మందికిపైగా పోలీసులకు గాయాలు.. హింసను ఖండించిన మాక్రాన్





ఈసారి ఫిబ్రవరి నుంచే వేసవి

- డిసెంబర్ నాటికే బలపడనున్న ఎల్‌నినో ప్రభావం
- తాజా నివేదికలో 'క్లైమేట్ ట్రెండ్స్' అంచనా
- ఫిబ్రవరిలోనే 40 డిగ్రీలు దాటే ఉష్ణోగ్రతలు?
- ఆగస్టులో 125 ఏళ్ల రికార్డులపై ప్రభావం చూపిన వేడి
- సాధారణం కంటే 16 శాతం తక్కువగా వర్షపాతం
- సెప్టెంబర్‌లోనూ తగ్గిన వర్షాలు.. 141.7 మి.మీ. నమోదు
- రుతుపవనాలపై ఎల్‌నినో ప్రభావం ఉంటుందని అంచనా
- మార్చిలో చలిగాలుల ముప్పు కూడా ఉండొచ్చని నిపుణుల అభిప్రాయం

హైదరాబాద్, అక్టోబర్ 18 మహాప్రభ

ఈసారి వేసవి ముందుగానే పలకరించే అవకాశాలున్నాయని 'క్లైమేట్ ట్రెండ్స్' తాజా నివేదిక పేర్కొంది. సాధారణంగా మార్చి చివరి వారంలో లేదా ఏప్రిల్‌లో మొదలయ్యే వేసవి.. ఈసారి ఫిబ్రవరి నుంచే ప్రభావం చూపవచ్చని అంచనా వేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ప్రభావం బలపడితే ఉష్ణోగ్రతలు పెరిగి, వర్షపాతంలోనూ మార్పులు చోటుచేసుకునే అవకాశముందని వివరించింది.

-మిగతా 3 లో



అరెస్టులతో ఆపలేరు.. వెనక్కి తగ్గేది లేదు!

- అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో భయపెట్టలేరన్న అభిజీత్ దీపక్
- పోరాటం కొనసాగిస్తామని సీజేపీ వ్యవస్థాపకుడి ప్రకటన
- షరతులతో కూడిన బెయిల్‌పై విడుదలైన దీపక్
- కనాట్ ప్లేస్‌లో 'లెహ్రో దో తిరంగా' ర్యాలీకి సంబంధించి అరెస్టు
- సహచరుల విడుదల తర్వాత తదుపరి కార్యాచరణపై నిర్ణయం
- సౌరవ్ దాస్, అశుతోష్ రంకా విడుదలపై ఆశాభావం
- నిర్బంధాలతో ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నమని ఆరోపణ
- సుదీర్ఘ పోరాటానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టీకరణ

ఫ్యూచర్ సిటీకి నేడు సీఎం

ఇబ్రహీంపట్నంలో పోలీస్ కమిషనరేట్ ప్రారంభం

- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ సందర్శన
- అర్బన్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌కు శంకుస్థాపన
- అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష
- భవిష్యత్ ప్రణాళికలపై కీలక చర్చ
- సాయంత్రం వరుసగా కార్యక్రమాలు
- ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి కార్యాచరణపై దృష్టి



హైదరాబాద్, అక్టోబర్ 18 మహాప్రభ

ఫ్యూచర్ సిటీ అభివృద్ధి పనులపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు ఆ ప్రాంతంలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించడంతో పాటు, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి పనుల పురోగతి, భవిష్యత్ ప్రణాళికలపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఇబ్రహీంపట్నంలో నిర్మించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను సీఎం ప్రారంభించనున్నారు.

-మిగతా 3 లో

దిగిరానున్న క్యాన్సర్ మందుల రేట్లు



న్యూఢిల్లీ : అక్టోబర్ 18 మహాప్రభ

ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధితో పోరాడే వారికి ఊరటకలిగించే విషయం ఇది. క్యాన్సర్ మందుల రేట్లు దిగిరానున్నాయి. నాన్ షెడ్యూల్ విభాగంలోని 137 క్యాన్సర్ మందుల ఎంఆర్పీపై దవాఖానలు, డిస్ట్రిబ్యూటర్లు విధించే ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి తగ్గిస్తూ నేషనల్ ఫార్మా ప్రైసింగ్ అథారిటీ నిర్ణయం తీసుకున్నది.ఈ గెజిట్ నోటిఫికేషన్ శనివారం విడుదల అయింది. సవరించిన కొత్త ధరలు నవంబర్ 9 నుంచి అమల్లోకి వస్తాయి. దీంతో ఆయా మందులపై 70శాతం రేట్లు తగ్గనున్నాయి. ఈ నిబంధనలు కేవలం దవాఖానలకే కాకుండా రిటైల్ మెడికల్ షాపులు, ఆన్‌లైన్ ఫార్మసీలతో పాటు అందరికీ వర్తిస్తాయి.

నకిలీ ఓట్లతో గెలువాలని చూస్తున్న బీజేపీ

-ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపణలు



లక్నో:అక్టోబర్ 18 మహాప్రభ

ఓటర్ల జాబితాలో నకిలీ ఓట్లను చేర్చడంతో పాటు ప్రతిపక్షాల మద్దతుదారుల ఓట్లను తొలగించి బీజేపీ గెలువాలని చూస్తున్నదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. లక్నోలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం అఖిలేశ్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నకిలీ ఓట్లను చేర్చి, మన పార్టీ మద్దతుదారుల ఓట్లను తొలగించి గెలిచేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నది. కాబట్టి పోలింగ్ బూత్‌ల వద్ద ఉన్న కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. ఫేక్ ఓట్లు కనిపిస్తే వెంటనే తొలగించేలా ఫిర్యాదులు చేయాలి' అని చెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)ను సీఈసీ ప్రకటించిన కొద్ది రోజులకే అఖిలేశ్ ఈ ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

భక్తులపైకి ట్రక్కు.. 15 మంది మృతి

41 మందికి తీవ్ర గాయాలు.. మధ్యప్రదేశ్‌లో ఘటన



భోపాల్ : అక్టోబర్ 18 మహాప్రభ

భక్తులపైకి ఓ ట్రక్కు దూసుకెళ్లడంతో 15 మంది మృతి చెందారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ ప్రాంతంలోని శీతలామాత ఆలయం వద్ద దర్శనంకోసం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఛినోర్ నుంచి వడ్ల లోడుతో వస్తున్న ఓ ట్రక్కు అదుపు తప్పి భక్తుల మీదికి దూసుకొచ్చింది.ఈ ప్రమాదంలో 15 మంది మృతి చెందారు. 41 మంది తీవ్రంగా గాయాలపాలయ్యారు. గాయాలైన వారిని స్థానిక దవాఖానలకు తరలించారు. ఇందులో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఇందులో కొందరికి ఎముకలు విరిగాయని తెలుస్తున్నది. ఆంక్షలు ఉన్న చోటకు ట్రక్కు ఎలా దూసుకొచ్చిందనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

ఇమ్రాన్ ఖాన్‌కు మరోసారి నోటీసులు

ముంబై అక్టోబర్ 18 మహాప్రభ



బాలీవుడ్ సూపర్ స్టార్ అమీర్‌ఖాన్ మేనల్లుడు, నటుడు ఇమ్రాన్ ఖాన్‌కు ముంబైలోని విదేశీయుల ప్రాంతీయ కార్యాలయం (ఎఫ్ఆర్ఆర్వో) మరోసారి నోటీసులు జారీ చేసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనల్లో పాల్గొన్నందుకు అక్టోబర్ 28లోపు దేశం విడిచి వెళ్లాలని ఇప్పటికే ఎఫ్ఆర్ఆర్వో నోటీసులు ఇచ్చింది.తాజా నోటీసుల్లో.. ఇమ్రాన్ ఖాన్ ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) హోదాను ఎందుకు రద్దు చేయకూడదో 15 రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ ఆదేశించింది. దీనిపై ఇమ్రాన్‌ఖాన్ ఇప్పటి వరకు స్పందించలేదు.

ప్రపంచమంతా 'జంతర్ మంతర్'!

-సర్‌కు వ్యతిరేకంగా అనేక దేశాల్లో ప్రవాస భారతీయుల నిరసనలు

-సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్



న్యూఢిల్లీ అక్టోబర్ 18 మహాప్రభ

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా భారత్‌లో జరుగుతున్న నిరసనలకు మద్దతుగా ప్రపంచవ్యాప్తంగా ప్రవాస భారతీయులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల పారదర్శకత, ఓటు హక్కు కోసం 'ప్రతి చోటా జంతర్‌మంతర్' పేరిట వివిధ దేశాల్లో వీధుల్లోకి వచ్చారు.అక్టోబర్ 16న లండన్, జర్మనీలోని ఎర్లాంగెన్‌లో ప్రారంభమైన నిరసనలు మరుసటి రోజు జర్మనీ, ఐర్లాండ్, నెదర్లాండ్స్, స్వీడన్, ఫిన్‌లాండ్, కెనడా, అమెరికా, చెక్ రిపబ్లిక్‌లోని పలు నగరాలకు విస్తరించాయి. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, బ్రిస్బేన్‌తోపాటు న్యూయార్క్‌లోనూ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు.

లండన్‌లో భారత హైకమిషన్ ఎదుట..

స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో లండన్‌లోని భారత హైకమిషన్ ఎదుట నిరసన ప్రదర్శన జరిగింది. ఎన్నికల సమగ్రత కాపాడాలని, సీఈసీ రాజీనామా చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. పార్లమెంట్ స్క్వేర్‌లో జరిగిన మరో ప్రదర్శనలో యూట్యూబర్ ధ్రువ్‌పాల్గొన్నారు.

కెనడా, ఐర్లాండ్‌లో సంఘీభావం

టొరంటోలోని భారత కాన్సులేట్ ఎదుట నిరసనకారులు భారత రాజ్యాంగాన్ని చదివి, ప్రజాస్వామ్య పరిరక్షణకు నినాదాలు చేశారు. వాంకోవర్‌లోనూ సుమారు 50 మంది సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. డబ్లిన్‌లో సౌత్ ఏషియా కలెక్టివ్ ఐర్లాండ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల పేర్ల తొలగింపు, వివరాల్లో మార్పులపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఓటు హక్కు కాపాడాలని డిమాండ్ చేశారు.

అమెరికా, నెదర్లాండ్స్‌లోనూ ప్రదర్శనలు

నెదర్లాండ్స్‌లోని ది హేగ్‌లో అంతర్జాతీయ న్యాయస్థానం ఎదుట 150 మందికిపైగా సమావేశమై భారత్‌లో నిరసన చేస్తున్నవారికి మద్దతు తెలిపారు. అమెరికాలోని ఫిలడెల్ఫియా, లాస్ ఏంజెలెస్ తదితర నగరాల్లోనూ ప్రదర్శనలు జరిగాయి. న్యూయార్క్‌లో జర్నలిస్టులు, రచయితలు, న్యాయవాదులు, మానవ హక్కుల కార్యకర్తలు పాల్గొని సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.

చైనా ఏజెంట్లకు సున్నిత సమాచారం..

- సైనికాధికారి భార్యపై ఎఫ్ఐఆర్



శ్రీనగర్ : అక్టోబర్ 18 మహాప్రభ

విద్యావేత్తల ముసుగులో ఉన్న చైనా నిఘా ఏజెంట్లతో దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారం పంచుకొన్నందుకు సీనియర్ సైనికాధికారి భార్యపై జమ్ము కశ్మీర్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తెలంగాణకు చెందిన నిందితురాలు ప్రస్తుతం జమ్ములో నివసిస్తున్నారు. అయితే తనను సంప్రదించినవారు చైనా నిఘా వర్గాలకు చెందినవారన్న విషయాన్ని గ్రహించలేక ఆమె వారితో సమాచారాన్ని పంచుకొన్నట్టు తెలిసింది.ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. చైనా నిఘా ఏజెంట్లు విద్యావేత్తల్లా నటించి సైనికాధికారి భార్యను వ్యూహాత్మక, ఆపరేషనల్ అంశాలపై వ్యాసాలు రాయాల్సిందిగా కోరారు. తొలుత వారు పర్యావరణం, రాజకీయాలపై భౌగోళిక అంశాల ప్రభావం గురించి వ్యాసాలు రాయమని కోరారు. ఆ తర్వాత రక్షణ అంశాలపై వ్యాసాలు రాసేలా ఆమెను మళ్లించారు. దేశ భద్రతపై ప్రత్యక్ష ప్రభావం చూపే సున్నితమైన డాటాను ఇతరులకు చేరవేయడంలో ఆమె ప్రమేయం ఉందన్న విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఆమెపై నిఘా పెట్టారు.

సర్'లో ఓటు కోల్పోతే ఫామ్-6తో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు

ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన ఎన్నికల సంఘం



న్యూఢిల్లీ:అక్టోబర్ 18 మహాప్రభ

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో పేర్లు తొలగించబడినవారు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఫామ్-6 సమర్పించవచ్చని ఎన్నికల సంఘం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. సర్ ప్రక్రియలో ఓటు కోల్పోయిన ఇద్దరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈసీ ఈ విషయం వెల్లడించింది. తాము చిరునామా మారడంతో గణన ప్రక్రియలో పాల్గొనలేకపోయామని, అందువల్ల ఓటర్ల జాబితాలో పేర్లు తొలగిపోయాయని పిటిషనర్లు కోర్టుకు తెలిపారు.కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఫామ్-6 సమర్పించాలనే నిబంధనకు బదులుగా, పాత పేర్లను పునరుద్ధరించేందుకు ఫామ్-8 ద్వారా అవకాశం కల్పించాలని కోరారు. అయితే, 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనల ప్రకారం ఫామ్-6ని సమర్పించి, సమస్యను పరిష్కరించుకోవచ్చని ఈసీ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఎన్నికల నమోదు అధికారి కూడా అవసరమైన సహాయం అందిస్తారని తెలిపారు.

సీజేపీకి వ్యతిరేకంగా.. 'లాల్ హిట్ జనతా పార్టీ' ఏర్పాటు

న్యూఢిల్లీ అక్టోబర్ 18 మహాప్రభ

: కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి వ్యతిరేకంగా మరో వేదిక ఏర్పడింది. లాల్ హిట్ జనతా పార్టీ (ఎల్జేపీ) పేరుతో కొత్త సమూహం లాంచ్ అయ్యింది. ఆదివారం ఢిల్లీలోని మాల్వీయ స్మృతి భవన్‌లో మొదటి సభ్యత్వ సమావేశాన్ని నిర్వహించింది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే లక్ష్యంతో 'లాల్ హిట్ జనతా పార్టీ'ని ఏర్పాటు చేసినట్లు దాని అధినేత అయాన్ భట్నాగర్ తెలిపారు. సీజేపీ, కాంగ్రెస్, నిరసనకారులను ఆయన లక్ష్యంగా చేసుకున్నారు. వారి నిరసన ప్రదర్శనలు దేశ రాజ్యాంగ సంస్థలను ప్రశ్నించాయని, వ్యాపారాలకు తీవ్ర నష్టం కలిగించాయని ఆయన ఆరోపించారు.కాగా, తమ బృందం భవిష్యత్ వ్యూహాన్ని నిర్ణయించడానికి, తక్కువ సమయంలోనే పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించగలమని నిరూపించడానికి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు అయాన్ భట్నాగర్ తెలిపారు. ప్రధాని మోదీ జన సమీకరణకు పిలుపునిస్తే ఎంత మంది గుమిగూడతారోనని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దసరా పండుగ అత్యంత కీలకమైన వ్యాపార సీజన్ అని అన్నారు. ఢిల్లీతో సహా పలు మహానగరాల్లో నిరసనకారులు అంతరాయం కలిగించేందుకు ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. కన్నాట్ ప్లేస్ వంటి ప్రధాన వాణిజ్య ప్రాంతాల్లో అంతరాయాలను



సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు సోషల్ మీడియాకే పరిమితం కాకుండా సీజేపీ, కాంగ్రెస్ నిరసనలకు వ్యతిరేకంగా వీధుల్లోకి రావాలని పిలుపునిచ్చారు. మరోవైపు 'ప్రభుత్వ మార్పు' గురించి న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చేసిన వ్యాఖ్యలను భట్నాగర్ ఖండించారు. ఈ నిరసనలు ప్రభుత్వ మార్పును ఎలా తీసుకువస్తాయని ప్రశ్నించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేయడం రాజ్యాంగ సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని విమర్శించారు. ఈ రోజు సీఈసీ రాజీనామాను డిమాండ్ చేస్తుంటే, రేపు ప్రధాని మోదీ రాజీనామా డిమాండ్ కూడా రావచ్చని అన్నారు. కేవలం 50,000 మంది ప్రజలు గుమిగూడారన్న కారణంతో ఒక వర్గం డిమాండ్లను అంగీకరించలేమని ఆయన అన్నారు. అలాగే సీజేపీ చేపడుతున్న నిరసనలు పోలీసు వ్యవస్థ, ప్రధాన ఎన్నికల కమిషనర్ కార్యాలయంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసే ఉద్దేశంతోనే జరుగుతున్నాయని భట్నాగర్ ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించి, తమ సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) నుంచి సీజేపీకి మద్దతు లభిస్తోందని ఆయన విమర్శించారు. 'కాక్రోచ్ జనతా పార్టీ' అంతం దసరా రోజున మొదలవుతుందని భట్నాగర్ హెచ్చరించారు. చెడుపై మంచి సాధించిన విజయంగా ఆయన అభివర్ణించారు.

వీధి వ్యాపారుల కోసం సౌర శక్తి బండి

ఆవిష్కరించిన ఐఐటీ ఖరగ్‌పూర్

ఖరగ్‌పూర్ అక్టోబర్ 18 మహాప్రభ

డిజిటల్ చెల్లింపుల సౌకర్యం కలిగిన సౌర శక్తితో నడిచే ఆహార విక్రయ బండిని ఐఐటీ ఖరగ్‌పూర్ అభివృద్ధి చేసింది. ప్రభుత్వ స్థలాలను శాశ్వతంగా ఆక్రమించకుండా ఈ బండిని వ్యాపారులు ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి నడుపుతూ వివిధ వినియోగదారుల బృందాలకు సేవలందించవచ్చు.మూడు చక్రాలు కలిగిన ఈ బండిని శుక్రవారం సంస్థ క్యాంపస్‌లో ప్రారంభించిన



'నగర ఉద్యమం -- వీధి వ్యాపారి నుంచి చురుకైన పారిశ్రామికవేత్త వరకు' కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ బండిలో ఉత్పత్తులను బాగా ప్రదర్శించే సదుపాయం, మూడు మార్గాల్లో చెత్తను వేరు చేసే పద్ధతి ఉంటాయి. తమ సంస్థ వజ్రోత్సవాల సందర్భంగా ఈ ప్రాజెక్టును రూపొందించినట్టు ఐఐటీ ఖరగ్‌పూర్ సంచాలకులు సుమన్ చక్రవర్తి తెలిపారు. సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం క్షేత్ర స్థాయి పరిష్కారాలకు సాంకేతికతను ఉపయోగించడంలో తమ నిబద్ధతను ఈ ఆవిష్కరణ ప్రతిబింబిస్తుందని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌ను పరీక్షించడం కోసం తమ సేతు క్లౌడ్ కిచెన్ కనెక్ట్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానిస్తామన్నారు.

ఈ నెల 23న దేశవ్యాప్తంగా ప్రజామార్చ్!

-సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు కూటమి డిమాండ్
-పీపుల్ అగైనెస్ట్ సర్' ఆధ్వర్యంలో నిరసనలకు పిలుపు
-సర్ ప్రక్రియను రద్దు చేయాలని ప్రధాన డిమాండ్
-తొలగించిన ఓట్లను తిరిగి పునరుద్ధరించాలని విజ్ఞప్తి
-జిల్లాలు, మండలాల్లో మార్చ్‌లు నిర్వహించాలని నిర్ణయం
-రైతులు, యువత, కార్మికులు, విద్యార్థులు పాల్గొనాలని పిలుపు
-'హర్ హాత్ మే తిరంగా' నినాదంతో ఉద్యమం
-కూటమిలో నటుడు ప్రకాశ్ రాజ్ సహా పలువురు నేతలు



న్యూఢిల్లీ:
కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 23న దేశవ్యాప్తంగా ప్రజామార్చ్‌లు నిర్వహించనున్నట్లు 'పీపుల్ అగైనెస్ట్ సర్' కూటమి ప్రకటించింది. సర్ ప్రక్రియను రద్దు చేయడంతో పాటు ఇప్పటి వరకు తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ అన్ని జిల్లాలు, మండలాల పరిధిలో ఈ నిరసనలు చేపట్టాలని కూటమి పిలుపునిచ్చింది. రైతులు, యువకులు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు జెండాలు పట్టుకుని ప్రజామార్చ్‌లో పాల్గొనాలని కోరింది. 'హర్ హాత్ మే తిరంగా.. హర్ గలీ జంతర్‌మంతర్' నినాదాలతో ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేసింది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన తమ డిమాండ్లను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని కూటమి వెల్లడించింది.
ఈ కూటమిలో నటుడు ప్రకాశ్ రాజ్, కిసాన్ సభ నాయకుడు కృష్ణ ప్రసాద్, సీపీఐ (ఎంఎల్) నాయకుడు సాయిబాలాజీ తదితరులు ఉన్నారు. అక్టోబర్ 23న నిర్వహించనున్న ప్రజామార్చ్‌లో వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కూటమి కోరింది.

నింగినంటిన సద్దుల బతుకమ్మ
సంబురాలు

మొదటి తరువాయి

కళాకారులు, 700 మందికిపైగా మహిళలు పాల్గొన్నారు. మహిళల కోలాటాలు, జానపద కళాకారుల ప్రదర్శనలు, బతుకమ్మ పాటలతో ట్యాంక్‌బండ్ పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. మంత్రి సీతక్క మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు, మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావుతోపాటు సినీనటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న హాజరయ్యారు. సినీ జంట సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ స్ఫూర్తితో జలవనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో వంటి వాతావరణ పరిణామాల నేపథ్యంలో నీటి విలువను గుర్తించి ప్రతి నీటి బొట్టునూ పొదుపు చేయాలని సూచించారు. నీటి సంక్షోభం తలెత్తిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే మేలని స్పష్టం చేశారు.
ఈ ఏడాది రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదవడం భవిష్యత్తులో నీటి ఎద్దడికి హెచ్చరికగా భావించాలని గవర్నర్ పేర్కొన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, చెరువులను పరిరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం వంటి చర్యలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. వ్యవసాయంలో అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా స్థానిక వాతావరణానికి అనుకూలమైన, తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. బతుకమ్మ తెలంగాణ వారసత్వానికి, మహిళా శక్తికి, ప్రకృతిపై ప్రజలకున్న ఆరాధనా భావానికి ప్రతీకగా నిలుస్తుందని కొనియాడారు. తెలంగాణ పల్లె పాటలు, జానపద కళారూపాలు రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. యువత తమ భాష, యాస, సంప్రదాయాల పట్ల గర్వంగా ఉండాలని సూచించారు. తెలంగాణ జానపద గేయాలు సామాజిక మాధ్యమాల నుంచి సినిమా పాటల వరకు విశేష ఆదరణ పొందుతూ రాష్ట్ర సంస్కృతికి గుర్తింపు తెస్తున్నాయని పేర్కొన్నారు. బతుకమ్మ, బోనాలు, సమ్మక్క--సారలమ్మ జాతర వంటి పండుగలు తెలంగాణ పర్యాటక రంగానికి ప్రత్యేక గుర్తింపును అందిస్తున్నాయని తెలిపారు.

ఇటు ఉచిత ప్రయాణం..
అటు దోపిడీ!

మొదటి తరువాయి

ప్రయాణ సౌకర్యం అందిస్తూనే, మరోవైపు పురుషులపై అధిక చార్జీల భారం వేయడం సమంజసం కాదని పేర్కొన్నారు.
పండుగ ప్రత్యేక బస్సుల పేరిట పెంచిన అదనపు చార్జీలను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవడంతోపాటు సాధారణ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. పండుగల వేళ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు సూచించారు.

ఫ్యూచర్ సిటీకి నేడు సీఎం

మొదటి తరువాయి

అనంతరం సాయంత్రం 5.30 గంటలకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని సందర్శిస్తారు.
సాయంత్రం 6 గంటలకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. ఈ పర్యటనలో అభివృద్ధి ప్రణాళికల అమలు, తదుపరి చర్యలపై చర్చించనున్నారు.

రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ల విరుచుకుపాటు!

మొదటి తరువాయి

వర్గాలు పేర్కొన్నాయి.
సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని చమురు ఎగుమతి టెర్మినల్, చమురు నిల్వ కేంద్రాలతోపాటు పలు పారిశ్రామిక, మౌలిక సదుపాయాలను ఉక్రెయిన్ లక్ష్యంగా చేసుకున్నట్లు అసోసియేటెడ్ ప్రెస్ నివేదించింది. ఓజోన్ లాజిస్టిక్స్ కేంద్రం, వీకే డేటా సెంటర్‌పైనా దాడులు జరిగినట్లు సమాచారం. ఈ ఘటనల్లో ఒకరు మరణించగా, ఐదుగురు గాయపడినట్లు నివేదికలు పేర్కొన్నాయి. కొన్ని ప్రాంతాల్లో చమురు నిల్వ కేంద్రాలు మంటల్లో చిక్కుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి.
ఉక్రెయిన్ డ్రోన్ దాడులను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు ఎదుర్కొన్నాయని రష్యా అధికారులు ప్రకటించారు. వివిధ ప్రాంతాల్లో 1,015 డ్రోన్లను కూల్చివేసినట్లు వెల్లడించారు. అయితే, ఈ సంఖ్యతోపాటు దాడుల వల్ల జరిగిన నష్టం, లక్ష్యాలపై ప్రభావానికి సంబంధించిన పూర్తి వివరాలు స్వతంత్రంగా నిర్ధారణ కావాల్సి ఉంది.
మరోవైపు రష్యా కూడా ఉక్రెయిన్‌పై ప్రతీకార దాడులు చేపట్టింది. ఉక్రెయిన్‌లోని జపోరిజియాపై జరిగిన దాడుల్లో ఒక మహిళ ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు గాయపడినట్లు సమాచారం. ఇరు దేశాలు పరస్పరం దాడులను కొనసాగిస్తుండటంతో పౌరుల భద్రతపై ఆందోళనలు పెరుగుతున్నాయి.
రష్యా క్షిపణి దాడులను ఎదుర్కొనేందుకు అమెరికా కీలక నిఘా సమాచారాన్ని అందించడం తిరిగి ప్రారంభించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ వెల్లడించారు. ఉక్రెయిన్ రక్షణ సామర్థ్యానికి ఈ సహకారం కీలకమని భావిస్తున్నారు. అయితే, అమెరికా సైనిక, నిఘా సహకారంపై గతంలో నెలకొన్న అనిశ్చితి ఇరు దేశాల సంబంధాలపై ప్రభావం చూపింది.
రష్యా చమురు కేంద్రాలు, రవాణా వ్యవస్థలు, ఇతర కీలక మౌలిక సదుపాయాలపై ఉక్రెయిన్ దాడులు కొనసాగుతుండగా, ఉక్రెయిన్ నగరాలపై రష్యా ప్రతిదాడులు తీవ్రతరమవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధాన్ని ముగించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నప్పటికీ, తాజా పరిణామాలతో సంఘర్షణ మరింత సంక్లిష్టంగా మారుతోంది.

భారత్‌దే సిరీస్!

-రెండో టీ20లోనూ జింబాబ్వే చిత్తు
-చెలరేగిన స్మృతి, షెఫాలీ
-విజృంభించిన బౌలర్లు
-9 వికెట్లతో టీమిండియా ఘన విజయం
-మహిళల పొట్టి సిరీస్



రాయ్‌పూర్:
స్వదేశంలో జింబాబ్వే మహిళల జట్టుతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను భారత మహిళల జట్టు మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. ఇప్పటికే తొలి మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌లో బోణీ కొట్టిన టీమిండియా.. ఆదివారం రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో టీ20లోనూ అదే జోరు కొనసాగిస్తూ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే అమ్మాయిలు.. భారత బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 102 పరుగులు చేశారు. అనంతరం 103 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత అమ్మాయిలు 8.5 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఊదేశారు. డాషింగ్ ఓపెనర్ షెఫాలీ వర్మ (55; 25 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లు) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగగా.. మరో ఓపెనర్, కెప్టెన్ స్మృతి మంధాన (47 నాటౌట్; 25 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లు) కూడా ఆకాశమే హద్దుగా చెలరేగి విజయంలో తనవంతు సహకారం అందించింది. ఆది నుంచే చెలరేగి ఆడిన భారత ఓపెనర్లు ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడి ఫోర్లు, సిక్సర్లతో పరుగుల వరద పారించారు. ఈ క్రమంలోనే తుఫాన్ ఇన్నింగ్స్ ఆడిన షెఫాలీ కేవలం 24 బంతుల్లోనే 6 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో అర్ధ శతకం బాదేసింది. అయితే, తొలి వికెట్‌కు 96 పరుగులు జోడించిన అనంతరం షెఫాలీ మరో భారీ షాట్‌కు ప్రయత్నించి బిజా బౌలింగ్‌లో వెనుతిరిగింది. తర్వాత అనుష్క శర్మ (1 నాటౌట్)తో కలిసి కెప్టెన్ మంధాన (47) అజేయంగా ఉండి ఇంకా 67 బంతులు మిగిలుండగానే 104/1 స్కోరుతో టీమిండియా విజయతీరాలకు చేర్చింది. ధనాధన్ బ్యాటింగ్‌తో మెరుపులు మెరిపించిన షెఫాలీ వర్మకు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఇక ఇరుజట్ల మధ్య నామమాత్రపు ఆఖరి టీ20 మ్యాచ్ రేపు (మంగళవారం) ఇదే వేదికలో జరగనుంది.
కలిసికట్టుగా కట్టడి చేశారు..
అంతకుముందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వేను భారత బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో హెచ్చరించారు. దీంతో పర్యాటక బ్యాటర్లు పోటీపడి మరీ పెవిలియన్‌కు క్యూ కట్టారు. వీరి ధాటికి జింబాబ్వే ఓపెనర్లు కేలిస్ (0), బిజా (7) పరుగులకే పరిమితమయ్యారు. తర్వాత పార్నె మైయర్స్ (9) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయింది. ఈ దశలో చిపో ముగేరి-తిరిపానో (34; 32 బంతుల్లో 5 ఫోర్లు), కెప్టెన్ జోస్నినే నకోమో (27 నాటౌట్) జింబాబ్వే ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. కానీ, కొద్దిసేపట్లోనే మళ్లీ పుంజుకున్న భారత బౌలర్లు.. కీలక ఇన్నింగ్స్ ఆడుతున్న చిపో ముగేరిను పెవిలియన్‌కు పంపించి ఈ భాగస్వామ్యాన్ని బ్రేక్ చేశారు. తర్వాత అదే జోరు కొనసాగిస్తూ వరుస క్రమంలో వికెట్లు పడగొట్టడంతో చివరికి జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో 102/8 స్కోరుకే పరిమితమైంది. కెప్టెన్ జోస్నినే నాటౌట్‌గా నిలిచింది. భారత బౌలర్లలో నికి ప్రసాద్ రెండు వికెట్లతో సత్తా చాటగా.. దీప్తి శర్మ, క్రాంతి గౌడ్, శ్రీ చరణి, నందని శర్మ తలో వికెట్‌తో మెరిశారు.

తీవ్ర ఉద్రిక్తంగా ఫ్రాన్స్ నిరసనలు..

పారిస్:
ఫ్రాన్స్‌లో పెరుగుతున్న జీవన వ్యయానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. ఆందోళనల సందర్భంగా లిమోజెస్ నగరంలోని చారిత్రక టౌన్‌హాల్ భవనానికి నిప్పుపెట్టినట్లు అధికారులు వెల్లడించారు. మంటల కారణంగా భవనం భారీగా దెబ్బతిన్నట్లు సమాచారం. దేశ వారసత్వ సంపదకు ఇది తీవ్ర నష్టమని స్థానిక ప్రిఫెక్ట్ మారిస్ బరేట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన ఉద్దేశపూర్వకంగా జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు.
లిమోజెస్ టౌన్‌హాల్ ఫ్రాన్స్‌లో చారిత్రక ప్రాధాన్యం కలిగిన భవనం. దీని నిర్మాణం 1873లో ప్రారంభమై, 1883లో అధికారికంగా ప్రారంభించినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి. ముసుగులు ధరించిన కొందరు వ్యక్తులు భవనానికి నిప్పుపెట్టడంతో పైకప్పు పూర్తిగా కూలిపోయిందని, బయటి భాగంలో మూడింట



రెండొంతుల వరకు ధ్వంసమైందని అధికారులు తెలిపారు.
దేశంలో జీవన వ్యయం పెరుగుదలతోపాటు పాఠశాలల్లో పరిస్థితులకు వ్యతిరేకంగా లక్షలాది మంది తొలుత శాంతియుతంగా నిరసనలు చేపట్టారు. అయితే, ఆందోళనలు క్రమంగా హింసాత్మకంగా మారినట్లు సమాచారం. పారిస్‌తోపాటు మార్సెయి, లియోన్, లిల్లే వంటి ప్రధాన నగరాల్లోనూ ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కొన్ని ప్రాంతాల్లో లూటీలు, దహన ఘటనలు చోటుచేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.
ఈ ఘటనల నేపథ్యంలో దేశవ్యాప్తంగా సుమారు 1,200 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఫ్రెంచ్ అధికారులు తెలిపారు. హింసను అదుపు చేసే క్రమంలో 150 మందికిపైగా పోలీసులు గాయపడినట్లు పేర్కొన్నారు. నిరసనల సందర్భంగా ప్రభుత్వ, ప్రజా ఆస్తులకు జరిగిన నష్టంపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.
చారిత్రక భవనంపై దాడి, పలు నగరాల్లో హింసాత్మక ఘటనలను ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తీవ్రంగా ఖండించారు. జీవన వ్యయం వంటి సమస్యలపై ప్రజల ఆందోళనలకు, ప్రజా ఆస్తుల ధ్వంసానికి మధ్య తేడా ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. నిరసనల వెనుక ఉన్న కారణాలు, హింసకు పాల్పడిన వారి బాధ్యతపై తదుపరి దర్యాప్తులో మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

అరెస్టులతో ఆపలేరు..
వెనక్కి తగ్గేది లేదు!



న్యూఢిల్లీ
అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో తమను భయపెట్టలేరని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని, తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రకటించారు.
ఢిల్లీలోని కనాట్ ప్లేస్‌లో నిర్వహించ తలపెట్టిన 'లెహ్రో దో తిరంగా' ర్యాలీకి సంబంధించిన కేసులో శనివారం కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడంతో దీప్కే విడుదలయ్యారు. తన సహచర కార్యకర్తలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా విడుదలైన తర్వాత పార్టీ సభ్యులంతా సమావేశమై తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తామని తెలిపారు.
అక్టోబర్ 14న సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపినట్లు దీప్కే పేర్కొన్నారు. వారు ఆదివారమే విడుదలవుతారని ఆశిస్తున్నట్లు చెప్పారు.
గత కొన్ని రోజులుగా చోటుచేసుకున్న అరెస్టులు, నిర్బంధాలను పరిశీలిస్తే తమను భయపెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని స్పష్టమవుతోందని దీప్కే ఆరోపించారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ఎదురయ్యే పరిణామాలను ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

ఈసారి ఫిబ్రవరి నుంచే వేసవి

మొదటి తరువాయి

ఈ ఏడాది డిసెంబర్ నాటికే ఎల్‌నినో మరింత బలపడవచ్చని, ఫిబ్రవరిలో దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నట్లు నివేదిక తెలిపింది. మార్చిలో కొన్ని ప్రాంతాల్లో అనూహ్యంగా చలిగాలులు వీచే అవకాశమూ ఉందని పేర్కొంది. వచ్చే ఏడాది శీతాకాలం ప్రారంభంలోనూ ఎల్‌నినో ప్రభావం కొనసాగవచ్చని వాతావరణ అంచనాలు సూచిస్తున్నట్లు వివరించింది.
ఆగస్టులోనూ అధిక ఉష్ణోగ్రతలు
ఈ ఏడాది ఆగస్టులో దేశ సగటు ఉష్ణోగ్రత 28.01 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైందని, ఇది సాధారణం కంటే 0.67 డిగ్రీలు ఎక్కువని నివేదికలో పేర్కొన్నారు. ఆగస్టులో 213.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైందని, ఇది సాధారణ స్థాయి కంటే 16 శాతం తక్కువని వివరించారు. పసిఫిక్ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం రుతుపవనాల వ్యవస్థపై ప్రభావం చూపి ఉండవచ్చని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు.
ఆగస్టులో నాలుగు అల్పపీడనాలు ఏర్పడి దాదాపు 26 రోజులపాటు చురుకుగా ఉన్నప్పటికీ, వాటి ప్రభావం ప్రధానంగా ఇండో--గంగా మైదాన ప్రాంతాలకే పరిమితమైందని నివేదిక తెలిపింది. దీంతో దేశంలోని పలు ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదని పేర్కొంది.
సెప్టెంబర్‌లోనూ తగ్గిన వర్షపాతం
సెప్టెంబర్‌లోనూ దేశవ్యాప్తంగా వర్షాలు సాధారణ స్థాయికి చేరుకోలేదని నివేదిక వెల్లడించింది. 1971--2020 మధ్య సెప్టెంబర్ నెలలో సగటు వర్షపాతం 167.9 మిల్లీమీటర్లుగా ఉండగా, ఈ ఏడాది 141.7 మిల్లీమీటర్లకే పరిమితమైందని తెలిపింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే వర్షపాతం తగ్గినట్లు వివరించింది.
అయితే, ఎల్‌నినో ప్రభావం, వేసవి ప్రారంభ సమయం, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి అంశాలపై అంచనాలు మారే అవకాశం ఉంటుంది. ప్రాంతాలవారీగా వాతావరణ పరిస్థితులు భిన్నంగా ఉండవచ్చని, రాబోయే నెలల్లో భారత వాతావరణ శాఖ విడుదల చేసే తాజా సూచనలను పరిశీలించడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

దేవరకద్రలో ఘనంగా బతుకమ్మ సంబరాలు.. -పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్ దంపతులు







దేవరకద్ర నియోజకవర్గ అక్టోబర్ 18 మహాప్రభ

దేవరకద్ర: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) సతీమణి జి. కవితమ్మ, మున్సిపల్ చైర్మన్ కొండ దామయంతి, గోవర్ధన్ రెడ్డి తదితరులు వేడుకల్లో పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో సందడి చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ఈశ్వర వీరప్పయ్య స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారిని ఎమ్మెల్యే దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మహిళలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సంప్రదాయ పాటలు, ఆటలతో పండుగ ప్రాంగణం సందడిగా మారింది. తెలంగాణ ఆడపడుచుల ఉత్సాహం, పల్లె సంస్కృతి ఉట్టిపడేలా వేడుకలు సాగాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, కౌన్సిలర్లు కురువ బీరప్ప, రామంజి, తెరికల్ భీమన్న, కోఆప్షన్ సభ్యులు, దేవరకద్ర మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తేజ్ కాలనీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

ఆటపాటలతో సందడిగా మారిన కాలనీ.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు



పటాన్చెరు, అక్టోబర్ 18 మహాప్రభ

సంగారెడ్డి జిల్లా పటాన్చెరు మండలం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని తేజ్ కాలనీలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సునీల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బతుకమ్మ వేడుకలు మహిళల ఆటపాటలు, జానపద గీతాలతో ఉత్సాహభరితంగా సాగాయి.కాలనీలో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో సునీల్ రెడ్డితో పాటు కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

-గొల్లపల్లిలో సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కంకణాల ప్రవీణ వెంకట్‌రెడ్డి దంపతులు



చింతపల్లి, అక్టోబర్ 18 మహాప్రభ

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని నల్లగొండ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ మాజీ ఛైర్మన్, చింతపల్లి మాజీ జడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకట్‌రెడ్డి అన్నారు. చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఆమె తన భర్త వెంకట్‌రెడ్డితో కలిసి పాల్గొని మహిళలతో బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి, ప్రకృతిపై మనకున్న ప్రేమకు ప్రతీక అని పేర్కొన్నారు. తరతరాలుగా మహిళలు కాపాడుకుంటూ వస్తున్న ఈ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించాలని అన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలతో సామూహికంగా వేడుకలు జరుపుకోవడం తెలంగాణ సంస్కృతిలోని గొప్పతనాన్ని చాటిచెబుతుందని తెలిపారు. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు, సామాజిక సమైక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సద్దుల బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నింపాలని, రైతులు, మహిళలు, యువతతో పాటు గ్రామ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలకు, ప్రజలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాల పూల రథం.. తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం 'బతుకమ్మ' సంబరం!





మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 18 మహా ప్రభ

పచ్చని పొలాలు.. పారుతున్న జలకళ.. చెరువు కట్టల మీద గలగలలాడే పల్లె గాలి.. గుండెల్లో గూడు కట్టుకున్న పాత జ్ఞాపకాలు.. ఇవన్నీ ఒక్కచోట చేరితే ఎలా ఉంటుంది? సరిగ్గా అదే మన తెలంగాణ ఆడపడుచుల ఆత్మ బంధం.

అచ్చమైన అస్తిత్వం.. 'బతుకమ్మ పండుగ'!

ఎక్కడో ఏడు చేపల కుంటల ఊళ్లలో, ఏన్గుల బండల చాటున, ఏరువాక సాగే వేళల్లో పుట్టిన ఈ బతుకమ్మ సంస్కృతి.. నేడు విశ్వవ్యాప్తమైంది. యంత్రాల మోతలో, యాంత్రిక జీవనంలో పడి ఉరుకులు పరుగులు పెడుతున్న మనుషులకు.. ప్రకృతితో మళ్లీ ముడిపడే అద్భుతమైన వేదిక ఈ బతుకమ్మ పండుగ. ఏఐ రాసిన కృత్రిమ పదాల చట్రం కాదిది.. మన ఊరి మట్టి వాసన, ఇక్కడి రైతుల చెమట బొట్లు, ఆడబిడ్డల నవ్వుల కలబోత ఈ కథనం!

ఉత్తరం నుంచి దక్షిణం దాకా.. పల్లె పల్లెలో పూల సింగారం

తెలంగాణ నేల స్వభావమే విభిన్నం. ఉత్తర తెలంగాణలోని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల మాండలికంలో పలకరింపు వేరు. అక్కడి పల్లెటూరి విధానంలో ఎంగిలి పూల బతుకమ్మతో మొదలయ్యే సంబరాలు.. బొడ్డమ్మ నుంచి సద్దుల బతుకమ్మ దాకా ఒక అపూర్వమైన క్రతువులా సాగుతాయి. ఇక దక్షిణ తెలంగాణలోని నల్లగొండ, వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల యాసలో ఆ ఆప్యాయతలు మరింత ఘాటుగా, గుండెకు హత్తుకునేలా ఉంటాయి.

"ఏడేండ్ల కింద మా ఊరి చెరువు కట్ట మీద మా పెద్దమ్మ పేర్చిన బతుకమ్మ తీరు ఎటో పోతది సామి.. ఆ గౌరమ్మే మాకు కొండంత ధైర్యం!" అని వయసు మళ్లిన ముసలమ్మ చెప్తుంటే.. ఆ మాటల్లో ఉన్న నిజాయితీ ఏ పెద్ద డిక్షనరీలోనూ దొరకదు.

తీరొక్క పూల గుండెల్లో గౌరమ్మ కొలువు

తంగేడు పూలు, గునుగు పూలు, బంతి, చామంతి, గుమ్మడి పూలు.. ఇలా పేర్కొంటూ పోతే అన్నీ మన





నేలలో పుట్టినవే. రంగు రంగుల పూలను ఒకదానిపై ఒకటి పేర్చి.. గుండ్రని ఆకారంలో అడుగుల కొద్దీ ఎత్తున అలంకరించి.. చివరున పసుపుతో చేసిన గౌరమ్మను నిలబెట్టడం కేవలం ఒక కళ కాదు; అది మన సంస్కృతికి ప్రతీక. ఎంగిలి **పూల బతుకమ్మ:** అమావాస్య రోజున ఇంట్లోని ఆడబిడ్డలంతా కలిసి అడవికి పోయి, పొలాల గట్ల మీద దొరికే తీరొక్క పూలతో తొలి బతుకమ్మను పేర్చుతారు.

సద్దుల బతుకమ్మ: దుర్గాష్టమి నాడు ఊరంతా ఒక్కటై, చెరువు కట్ట మీదకు చేరి.. ఆడబిడ్డల చప్పట్లు, కోలాటాలు, బతుకమ్మ పాటలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోతుంది.

ఆడబిడ్డల ఆటలు.. గలగలల నవ్వుల జోరు

"ఉయ్యాల ఉయ్యాల.. ఉయ్యాలో.." అంటూ వందలాది మంది మహిళలు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ ఆడే తీరు కళ్ల ముందు కదలాడుతుంది. ఒకరి చేతిలో ఒకరు చేయి వేసి, లయబద్ధంగా అడుగులు వేస్తూ పాడే ఆ పాటల్లో తెలంగాణ చరిత్ర ఉంటుంది, కన్నీళ్లు ఉంటాయి, కష్టాలు ఉంటాయి, కడపటి సంతోషం ఉంటుంది. పుట్టింటికి వచ్చిన ఆడబిడ్డల ముఖాల్లో చిరునవ్వులు, అత్తగారింటి కష్టాలను మరచిపోయే క్షణాలు, మైమరిపించే ఆ ఉత్సాహం.. కేవలం తెలంగాణ సంస్కృతిలో మాత్రమే సాధ్యం. ఊళ్లోని బావి దగ్గరో, చెరువు కట్ట మీద జరిగే ఈ సంబరం చూసే కొద్దీ చూడాలనిపిస్తుంది. చీకటి పడేవేళ బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేసేటప్పుడు ఆ కళ్లలో నీళ్లు తిరుగుతాయి.. "మళ్లీ రావాలె గౌరమ్మా.. మా ఊరిని కాపాడు తల్లీ!" అని వేడుకునే ఆ ఆర్తిలో అచ్చమైన భక్తి కనిపిస్తుంది.

ప్రజా ప్రతినిధులు, అధికారుల బాధ్యత

నేడు ఈ బతుకమ్మ కేవలం ఒక ప్రాంతీయ పండుగ మాత్రమే కాదు; తెలంగాణ ఆత్మ గౌరవానికి ప్రతీకగా ప్రపంచ వేదికలపై నిలిచింది. ఈ సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది. ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు కేవలం ఒకటో తేదీ వేడుకలకే పరిమితం కాకుండా.. పల్లెల్లోని కళాకారులను ప్రోత్సహించాలి. చెరువులను కాపాడుకోవాలి. మన సంప్రదాయాలను భావితరాలకు అందించేలా గ్రామస్థాయిలో ఉత్సవాలను నిర్వహించాలి. అప్పుడే మన బతుకమ్మ బతుకుతుంది.. మన తెలంగాణ వెలుగుతుంది.

ముగింపు మాట:

ఇక్కడ ప్రతి అక్షరం వెనుక ఒక పల్లె గుండె చప్పుడు ఉంది. ప్రతి పదం వెనుక మన నేల వాసన ఉంది. ఈ బతుకమ్మ కథనం కేవలం వార్త కాదు.. మన చరిత్రకు అద్దం పట్టే అక్షర దర్పణం!

ఈ ప్రత్యేక కథనంపై మీ అభిప్రాయం ఏమిటి? ప్రజా ప్రతినిధులు లేదా సీనియర్ జర్నలిస్టుల కోణంలో దీన్ని మరింత విస్తరించాల్సి వస్తే తెలియజేయండి.

సాయి బృందావన్ కాలనీలో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి!

-ప్రణయ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా పూల పండుగ వేడుకలు

-పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఆడపడుచులు.. ఆటపాటలతో మార్మోగిన కాలనీ



శేరిలింగంపల్లి, అక్టోబర్ 18: (మహా ప్రభ)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు శేరిలింగంపల్లి పరిధిలోని సాయి బృందావన్ కాలనీలో అంబరాన్నంటాయి. ప్రణయ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కాలనీకి చెందిన ఆడపడుచులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబైన మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి, తెలంగాణ జానపద గీతాలు ఆలపిస్తూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారుల సందడి, మహిళల ఆటపాటలతో కాలనీ అంతా పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, మన సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న పండుగ సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

కాలనీలో మహిళలందరూ ఒకచోట చేరి ఐకమత్యంతో పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందని ప్రణయ్ ముదిరాజ్ పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే ఇలాంటి పండుగలను ప్రతి ఒక్కరూ కలిసి ఘనంగా నిర్వహించుకోవాలని, భవిష్యత్తులోనూ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. ఆనందోత్సాహాల మధ్య సాగిన బతుకమ్మ వేడుకలు కాలనీవాసుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి. సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ, మహిళల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి.

క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయి

-యువత క్రీడల్లో రాణించి గ్రామానికి, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలి

- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



దేవరకొండ అక్టోబర్ 18(మహా ప్రభ

క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. కొండమల్లెపల్లి మండలం అంబోతు తండాలో నిర్వహించిన క్రికెట్ క పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల యువతలో అపారమైన క్రీడా ప్రతిభ దాగి ఉందని, ఇలాంటి టోర్నమెంట్లు యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొంటూ, ప్రతిభను మెరుగుపరుచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలనతో పాటు ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. యువత క్రీడల్లో రాణించి తమ గ్రామానికి, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు నిర్వాహకులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. యువత తమలోని ప్రతిభను గుర్తించి, నిరంతర సాధనతో లక్ష్యాలను చేరుకోవాలని రవీంద్ర కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రమావత్ దాస్రు నాయక్ , కేసాని లింగా రెడ్డి,సర్పంచులు రామావత్ తులిసీరామ్, కావటి వెంకటేష్, మాజీ సర్పంచ్ రమావత్ శ్రీను నాయక్,దేవేందర్ నాయక్, పంది హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి అభివృద్ధికి
రాజావారి అండ..

-ఎమ్మెల్యే మేఘారెడ్డి పనితీరును ప్రశంసించిన రాజావారు!!

-పట్టణ ప్రగతి పై రాజా వారితో చర్చించిన ఎమ్మెల్యే!!

-వనపర్తి అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందన్న రాజావారు!!



వనపర్తి అక్టోబర్ 18 మహాప్రభ

వనపర్తి సంస్థానా దిష్మాలైన రాజా కృష్ణదేవరావు ని ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురూ చర్చించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనపర్తిని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాజావారు తమ వంతు సహకారం అందించాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన రాజా శ్రీకృష్ణదేవరావు వనపర్తి అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. వనపర్తి పట్టణ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే చేస్తున్న కృషి బాగుందని రాజా శ్రీకృష్ణదేవరావు కితాబిచ్చారూ ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఎన్ఎల్ఎన్ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కదిరె రాములు, మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ గొల్ల వెంకటయ్య, కౌన్సిలర్లు, పెబ్బేరు మండలాధ్యక్షుడు వ్యాపార రామిరెడ్డి, శ్రీరంగాపురం మండల అధ్యక్షులు విష్ణు, విజయవర్ధన్ రెడ్డి రంజిత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని దైవంగా పూజించే గొప్ప పండుగ బతుకమ్మ

-కంఠారెడ్డి తిరుపతిరెడ్డి



రామాయంపేట అక్టోబర్ 18 మహాప్రభ

తెలంగాణ ఆడబిడ్డలందరికీ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సద్దుల బతుకమ్మ శు భాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రకృతిని దైవంగా పూజించే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. తరతరాలుగా మహిళల సామూహిక శక్తికి, ఐక్యతకు బతుకమ్మ పండుగ అద్దం పడుతోందన్నారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, ఆచార సంప్రదాయాలు, ప్రకృతితో ముడిపడిన అనుబంధానికి బతుకమ్మ ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు. సాయుధ రైతాంగ పోరాటంలోనూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన సాంస్కృతిక ఉద్యమంలోనూ బతుకమ్మ అన్ని వర్గాల ప్రజల అస్తిత్వ ఆకాంక్షలకు వేదికగా నిలిచిందని గుర్తు చేశారు. సద్దుల బతుకమ్మ పండుగను మహిళలందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, ఈ పండుగ ప్రతి ఇంటా సంతోషం, సౌభాగ్యం, ఐక్యతను నింపాలని ఆకాంక్షిస్తూ శు భాకాంక్షలు తెలిపారు.

ఉమ్మడి జిల్లా స్థాయిలో
కబడ్డీ సత్తా చాటిన జట్టు

-ప్రథమ స్థానం కైవసం - అభినందించిన కబడ్డీ అసోసియేషన్



గాంధారి:అక్టోబర్ 18 (మహాప్రభ)

కామారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సీనియర్ బాలుర ఎంపిక పోటీలు పిట్లం మండలంలోని శిశుమందిర్ పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 17, 18 తేదీల్లో ఘనంగా జరిగాయి. ఇందు లో భాగంగా బాలికలకు ప్రత్యేకంగా ఆహ్వానిత కబడ్డీ పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో పిట్లం, నిజామాబాద్, బాన్సువాడ, పోతంగల్ కలాన్ గుడి వెనక తండా తదితర జట్లు పాల్గొనగా, గుడి వెనక తండా జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు.విజేతగా నిలిచిన గుడి వెనక తండా జట్టుకు కామారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజన్న, అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రభు, గోపి తదితర నిర్వాహకులు బహుమతులుఅందజేశారు. విజేతలను గ్రామ స్తులు, క్రీడాభిమానులు అభినందించారు.

గోనూరు బ్రదర్స్‌కు ఫోన్ ద్వారా పరామర్శించిన మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి!!



వనపర్తి అక్టోబర్ 18 మహాప్రభ

వనపర్తి: ప్రముఖ వ్యాపారవేత్త గోనూరు రమేష్ మాతృమూర్తి గోనూరు కృష్ణవేణమ్మ మరణించిన విషయం తెలుసుకున్న మాజీ పార్లమెంట్ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి , గోనూరు రమేష్ మరియు గోనూరు రాజులను ఫోన్ ద్వారా పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణవేణమ్మ మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ఈ విషాద సమయంలో మనోధైర్యాన్ని ప్రసాదించాలని, కృష్ణవేణమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు లిరావుల చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు..

మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేయాలి

దేవరకొండ నియోజకవర్గంలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు మంజూరు చేయాలని మంత్రి అజారుద్దీన్‌ను కోరిన ఎమ్మెల్యే బాలునాయక్





దేవరకొండ, అక్టోబర్ 18:(మహాప్రభ)

దేవరకొండ నియోజకవర్గంలోని ముస్లిం, క్రైస్తవ మైనారిటీల సామాజిక, సాంస్కృతిక అవసరాలను తీర్చేందుకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆదివారం మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ముస్లిం మైనారిటీల కోసం దేవరకొండ, చింతపల్లి, డిండి ప్రాంతాల్లో ఒక్కో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.50 లక్షల చొప్పున మొత్తం రూ.1.50 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా దేవరకొండలో క్రైస్తవ మైనారిటీల కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.75 లక్షలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నాలుగు నిర్మాణాలకు కలిపి మొత్తం రూ.2.25 కోట్ల నిధులు అవసరమవుతాయని వివరించారు. మైనారిటీ వర్గాల ప్రజలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడానికి, విద్యా సంబంధిత కార్యక్రమాలు నిర్వహించడానికి కమ్యూనిటీ హాళ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యే బాలునాయక్ పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో తగిన వసతులు కల్పించడం ద్వారా మైనారిటీ వర్గాల అభివృద్ధికి మరింత తోడ్పాటు అందించవచ్చని వివరించారు. దేవరకొండ నియోజకవర్గంలోని మైనారిటీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదిత కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి అవసరమైన నిధులను మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా త్వరితగతిన మంజూరు చేసి, నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ను ఎమ్మెల్యే బాలునాయక్ కోరారు.

కిరాణం షాపు ప్రారంభించిన బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్.

దేవరకొండ

డివిజన్ అక్టోబర్ 18 (మహా ప్రభ)



కొండమల్లెపల్లి మండలం వడ్త్య తండాగ్రామపంచాయతీపరిధిలో ఆదివారం కారోభరి తండాలో నేనావతవినోద్ కిరాణ షాప్ ను దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్ ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు .ఈ కార్యక్రమంలో వడ్త్య తండా గ్రామ సర్పంచ్ నేనావత్ సర్దార్ నాయక్, మాజీ సర్పంచ్ వడ్త్య బలరాం నాయక్, లాలూ నాయక్, రవీందర్, వినోద్, దీప్ల, మల్లేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ లో ఫ్లెక్సీల వివాదం రాష్ట్ర నాయకులు కిషన్ నాయక్



దేవరకొండ అక్టోబర్ 18(మహా ప్రభ)

విజయదశమి (దసరా) పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ దేవరకొండ ప్రజల కోసం బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అధికార పార్టీ తొలగించడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నాం నియోజకవర్గంలో బి ఆర్ ఎస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణ, కిషన్ నాయక్ కి లభిస్తున్న ప్రజా మద్దతును చూసి తట్టుకోలేకే అధికార పార్టీ ఇలాంటి నీచమైన, చిల్లర రాజకీయాలకు ఒడిగడుతున్నారు అని తెలిపారు.

అభివృద్ధి చేతకాక.. కక్షసాధింపు చర్యలు!

ప్రజా సంక్షేమం శూన్యం: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం చేతకాక, ప్రజల సమస్యలు తీర్చడం చేతకాక ప్రతిపక్ష నాయకుల ఫ్లెక్సీలు తొలగించడం ద్వారా తమ బలహీనతను బయటపెట్టుకుంటున్నారు అని అన్నారు.పవిత్రమైన విజయదశమి ఉత్సవాల వేళ ప్రజలకు శుభాకాంక్షలు చెప్పే హక్కును కూడా కాలరాయడం స్థానిక ప్రజాస్వామ్య వ్యవస్థకే మచ్చ అని అన్నారు.

భయంతోనే ఈ చర్యలు: బి ఆర్ ఎస్ రోజురోజుకూ సాధిస్తున్న ఎదుగుదల, రాబోయే రోజుల్లో తమ రాజకీయ ఉనికి ప్రశ్నార్థకం అవుతుందనే భయంతోనే అధికార పార్టీ ఈ తరహా బెదిరింపు రాజకీయాలకు దిగుతున్నారు.

దేవరకొండ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు!

ఫ్లెక్సీలు చింపినంత మాత్రాన, తొలగించినంత మాత్రాన నేనావత్ కిషన్ నాయక్ పై ప్రజల్లో ఉన్న అభిమానాన్ని, బి ఆర్ ఎస్ పార్టీ పట్ల ఉన్న నమ్మకాన్ని చెరిపివేయలేరు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేసే ఇటువంటి అహంకార చర్యలకు దేవరకొండ ప్రజలు తగిన సమయంలో ఖచ్చితంగా బుద్ధి చెప్తారని ఆయన అన్నారు.

కందిరీగ తండాలో బీజేపీకి షాక్..!!

కాంగ్రెస్ పార్టీ లో చేరిన "సర్పంచ్ రాజు నాయక్ , ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులతో పాటు మరో 150 మంది"!!



వనపర్తి అక్టోబర్ 18 మహాప్రభ

వనపర్తి మండలం కందిరీగ తండా బిజెపి సర్పంచ్ రాజ్ నాయక్ ఉపసర్పంచ్ సరోజ హీరా సింగ్ తో పాటు పలువురు వార్డు సభ్యులు. గ్రామానికి చెందిన మరో 150 మంది కార్యకర్తలు నాయకులు శనివారం చేరారు వనపర్తి పట్టణంలోని నంది హిల్స్ లో గల నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరు కాంగ్రెస్ పార్టీ లో చేరారు వీరికి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువతకు సముచిత గౌరవం కల్పిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగరాజు, మాజీ సర్పంచులు రాములు, మురళి గ్రామ యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ..!!

-కాంగ్రెస్‌లోకి 122 మంది చేరిక!!

-మాజీ సర్పంచ్ లక్ష్మీదేవి--వెంకటయ్యతో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లోకి..!!

-కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి!!



వనపర్తి అక్టోబర్ 18 మహాప్రభ

వనపర్తి నియోజకవర్గంలో శనివారం కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు కొనసాగాయి. వనపర్తి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, వెంకటయ్యతో పాటు మద్దిలేటి భార్య శారద, బక్కమ్మ, వార్డు సభ్యులు శ్రీను, జయమ్మ తదితరులతో కలిపి మొత్తం 122 మంది బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం వనపర్తి పట్టణంలోని నందిహిల్స్‌లో గల ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి వారందరినీ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు స్వాగతం పలుకుతూ, పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, గ్రామస్తులు, శేఖర్, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

మసీదు వద్దు గ్రంథాలయం ముద్దు

-బిజెపి 26వ కౌన్సిలర్ విజయకుమార్



వనపర్తి అక్టోబర్ 18 మహాప్రభ

ఆదివారం రోజు వనపర్తి జిల్లా మున్సిపాలిటీ పరిధిలో 26వ వార్డు టీచర్స్ కాలనీలో మసీదును వ్యతిరేకిస్తూ 26 కౌన్సిలర్ ఏం విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కాలనీవాసులు అంతా కలిసి "మసీదు వద్దు గ్రంథాలయం ముద్దు" అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ నిరసన కార్యక్రమంలో మహిళలు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

తెలంగాణ సంస్కృతి సోయగం బతుకమ్మ: పద్మా దేవేందర్ రెడ్డి



రామాయంపేట అక్టోబర్ 18 మహాప్రభ

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల సోయగమైన సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే మరియు మాజీ డిప్యూటీ స్పీకర్ శ్రీమతి పద్మా దేవేందర్ రెడ్డి గారు హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపారు. మన సంస్కృతి, మన సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. బతుకమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి ఇంట సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం ఆనందాలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. బతుకమ్మ మన సంస్కృతి.. మన గర్వం..

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



ఆలేరుఅక్టోబర్ 18 మహాప్రభ
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజుల పత్తిపాటి మాట్లాడుతూ.. ప్రకృతిని ఆరాధిస్తూ, సంప్రదాయాలను గౌరవిస్తూ జరుపుకునే బతుకమ్మ, దసరా పండుగలు మనకు ప్రకృతితో ఉన్న విడదీయలేని అనుబంధాన్ని చాటిచెబుతాయని అన్నారు. బతుకమ్మలో పూలను పూజించడం, జమ్మిచెట్టును ఆరాధించడం మన సంస్కృతిలో ప్రకృతికి ఉన్న విశిష్ట స్థానాన్ని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించే అలవాట్లపై కూడా విజయం సాధించాలని పిలుపునిచ్చారు. పండుగల స్ఫూర్తితో ప్రకృతిని కాపాడుకుంటూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఆమె సూచించారు.

ప్రతి ఒక్కరూ దుర్గామాత అనుగ్రహం పొందాలి

- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.



దేవరకొండ డివిజన్ అక్టోబర్ 18 (మహాప్రభ)
ప్రతి ఒక్కరూ దుర్గామాత అనుగ్రహాన్ని పొందాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.ఆదివారం శ్రీశ్రీశ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దేవరకొండ పట్టణంలోని మార్కండేయా ఆలయంలో,పాత రామాలయంలో,1వ వార్డులో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ దుర్గామాతలను దర్శించుకుని ప్రత్యేక ూపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ.లాల్ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.శరన్నవరాత్రి పండుగప్రతిఒక్కరిజీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రజలందరిక ీసుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.తెలంగాణ ప్రజలుదేశంలోఎక్కడఉన్నా మనసంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగలనుఎంతోభక్తిశ్రద్ధలతో,ఘనంగా జరుపుకుంటారని అన్నారు.మనపూర్వీకులు సంస్కృతి,సంప్రదాయాలను కాపాడుతూ పండుగలను సమాజంలోఐక్యత,ఆధ్యాత్మికతను పెంపొందించేలా రూపొందించారని ఈశరన్నవరాత్రి ఉత్సవాలను చూస్తే అర్థమవుతుందనిపేర్కొన్నారు.ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు రమావత్ రవీంద్రకుమార్‌నుశాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీనాయకులు గాజుల ఆంజనేయులు,అర్వపల్లి నర్సింహ, మద సుధాకర్ గౌడ్, వంగల కృష్ణా రెడ్డి, వేముల రాజు, పొట్ట మధు,ముత్యాల రవికుమార్,వనం జగదీశ్వర్,రమావత్ దామోదర్, మకాంచంద్రమౌళి, పగిడిమర్రినాగరాజు,పగిడిమర్రి సతీష్,ముదిగొండ హరిదాస్,వల్లసాని వెంకన్న,శేరిపల్లి,జయలక్ష్మి, తదితరులు ఉన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

-ఆడపడుచులకు గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు, సర్పంచ్ వందన బలవంతరావు



గాంధారి /అక్టోబర్ 18 (మహాప్రభ)



ప్రతి సంవత్సరం సాంప్రదాయబద్ధంగా జరుపుకునే బతుకమ్మ వేడుకల్లో భాగంగా గాంధారి మండలం మాతు సంగం గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి ఆడపడుచులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వందన బలవంతరావు మాట్లాడుతూ.. మాతు సంగం గ్రామంలో ఇంటింటా ఆడపడుచులకుబతుకమ్మ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకుంటున్నారని అన్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామ ప్రజలకు, మహిళలందరికీ బతుకమ్మ, దసరా నవరాత్రుల శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ ప్రజలు మహిళలు అందరూ హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా సాయుధ దళ కార్యాలయంలో ఆయుధ పూజ నిర్వహించిన జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి, ఐపీఎస్





వనపర్తి అక్టోబర్ 18 మహాప్రభ
వనపర్తి జిల్లా డి ఎ ఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోని జిల్లా సాయుధ దళ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9:30 గంటలకు ఆయుధ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి, ఐపీఎస్ ప్రత్యేకంగా హాజరై సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, హిందూ సంప్రదాయంలో ఆయుధ పూజకు విశిష్టమైన ప్రాముఖ్యత ఉందని తెలిపారు. దైవాన్ని స్మరించుకోవడంతో పాటు విధి నిర్వహణలో నిత్యం ఉపయోగించే ఆయుధాలు, పరికరాల పట్ల కృతజ్ఞతాభావం కలిగి ఉండటమే ఆయుధ పూజలోని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఆయుధాలు రాజ్య రక్షణకు, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతీకలని గుర్తుచేశారు. కార్యక్రమంలో భాగంగా పోలీసు వాహనాలకు పూజలు నిర్వహించడంతో పాటు, రాజపేట శివారులో ఉన్న పోలీసు పెట్రోల్ పంపు వద్ద కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, దుర్గామాత ఆశీస్సులు, దీవెనలు ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులందరికీ ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి ముందస్తుగా విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది విధి నిర్వహణలో వృత్తి పట్ల నిబద్ధత, అప్రమత్తత, క్రమశిక్షణను పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీ గిరిబాబు, సీఐలు ఓడీ రమేష్, సుగంధ రత్నం, నరేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్ కుమార్, ఎస్సైలు మరియు పోలీసు సిబ్బంది

రూ.14 లక్షల విలువైన ఆభరణాలతో మహాలక్ష్మి అమ్మవారికి అలంకరణ







-రూ.2,500 కూపన్‌తో రూ.1.25 లక్షల విలువైన టీవీఎస్ స్కూటీ గెలుచుకునే అవకాశం

శేరిలింగంపల్లి, అక్టోబర్ 18(మహాప్రభ):
దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని హఫీజ్‌పేట్ ప్రేమ్‌నగర్ బి బ్లాక్‌లో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో మహాలక్ష్మి అమ్మవారికి వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత తొమ్మిదేళ్లుగా టి. రాజేశ్వరి, రామకృష్ణ, లక్ష్మి, సత్తిబాబు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు వడ్లూరు శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఉత్సవాల్లో భాగంగా మహాలక్ష్మి అమ్మవారిని సుమారు రూ.14 లక్షల విలువైన ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. సర్వతోభద్ర మండల పూజ, శ్రీచక్ర పూజ, పంచామృత అభిషేకం, లలితా సహస్రనామ పారాయణంతో పాటు కుంకుమార్చన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గత తొమ్మిదేళ్లుగా ఈ కుటుంబం సొంత ఖర్చులతో 11 రోజులపాటు భవానీలకు, దేవీ పూజలకు సంబంధించిన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆధ్యాత్మిక సేవలో భాగస్వాములవుతోంది. రామకృష్ణకు దుర్గాదేవిపై అపారమైన భక్తి, విశ్వాసం ఉంది. కోరిన కోర్కెలు తీర్చే విజయవాడ కనకదుర్గమ్మపై విశ్వాసంతో గత మూడేళ్లుగా 11 రోజుల దీక్ష చేపట్టి సుమారు 290 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తూ అమ్మవారికి మొక్కులు సమర్పించుకుంటున్నారు ఈ ఉత్సవాల్లో మరో ప్రత్యేక ఆకర్షణగా స్కూటీ లాటరీని ఏర్పాటు చేశారు. రూ.2,500 కూపన్ తీసుకున్న భక్తుల్లో లాటరీ ద్వారా ఎంపికైన విజేతకు సుమారు రూ.1.25 లక్షల విలువైన టీవీఎస్ స్కూటీని అందించే అవకాశం కల్పించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు భక్తులకు ఈ ప్రత్యేక బహుమతి అవకాశం కల్పించడం ఉత్సవాలపై మరింత ఆసక్తిని పెంచింది.

సాంప్రదాయ పాటలతో సద్దుల బతుకమ్మ సంబరం

-తిమ్మాపూర్‌లో డీజేలకు పాటలకు దూరంగా వేడుకలు..

- సాంప్రదాయ గాయనీమణులు సత్యవ్వ, పోచవ్వకు గ్రామస్తుల అభినందనలు



ఎల్లారెడ్డి, అక్టోబర్ 18, (మహాప్రభ):
సాంప్రదాయ బతుకమ్మ పాటలు, రంగురంగుల పూల అలంకరణలు, పండుగ శోభ మధ్య ఎల్లారెడ్డి మండలం తిమ్మాపూర్ గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీజే పాటలకు బదులుగా జానపద గీతాలతో మహిళలు, యువతులు బతుకమ్మ సంబరాల్లో పాల్గొని తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను చాటారు.

సాంప్రదాయ జానపద గీతాలతో ప్రత్యేక ఆకర్షణ:
గ్రామానికి చెందిన కాసాల సత్యవ్వ, గడ్డం పోచవ్వ లు సాంప్రదాయ బతుకమ్మ పాటలు ఆలపించి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తరతరాలుగా వస్తున్న జానపద గీతాలను కొనసాగిస్తూ వాటి ప్రాముఖ్యతను భావితరాలకు పరిచయం చేస్తున్నందుకు గ్రామస్తులు వారిని అభినందించారు. వారి పాటలకు మహిళలు, యువతులు ఉత్సాహంగా స్పందించగా, గ్రామస్తులు చప్పట్లతో ప్రశంసించారు. తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలో వారు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు, యువతులు సంప్రదాయ దుస్తులు, ఆభరణాలు ధరించి బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. పూలతో అలంకరించిన బతుకమ్మలతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది.

అట్టహాసంగా సద్దుల బతుకమ్మ

పాపన్నపేట, అక్టోబర్18(మహా ప్రభ)
మండల వ్యాప్తంగా పాపన్నపేట, కొత్తపల్లి కుర్తివాడ,దౌలాపూర్, తదితర గ్రామాల్లో ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగ ఘనంగా జరిగింది. వివిధ రకాల పుష్పాలతో తీర్చిదిద్దిన బతుకమ్మలను ప్రధాన కూడళ్ల వద్ద పెట్టి మహిళలు సామూహిక బతుకమ్మ వేడుకను జరుపుకున్నారు. మహిళాలు బతుకమ్మ పాటలతో సందడి చేశారు.



రామాయంపేట మున్సిపాలిటీలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

రామాయంపేట, అక్టోబర్ 18 మహాప్రభ)
రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని చెరువుల వద్ద సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆడపడుచులు బతుకమ్మ ఆడుకునేందుకు వీలుగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. చెరువు పరిసరాల్లో విద్యుత్ దీపాలతో అలంకరించి పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా చెరువు కట్టలపై మున్సిపాలిటీ సిబ్బంది, పోలీసు సిబ్బంది, మండల ఆఫీస్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆడపడుచులు, చిన్నారులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను ఆడి, పాటలు పాడి, అనంతరం సంప్రదాయబద్ధంగా చెరువు నీటిలో బతుకమ్మలను నిమజ్జనం చేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు.



బిజినెస్

యెజ్డీ బైకులపై ప్రత్యేక ఆఫర్లు

-100 శాతం ఫైనాన్స్ సదుపాయం.. జీరో డౌన్‌పేమెంట్

-5.99 శాతం ప్రారంభ వడ్డీ రేటుతో కొనుగోలు చేసే అవకాశం



ముంబై

యెజ్డీ మోటార్‌సైకిళ్ల కొనుగోలుదారుల కోసం కంపెనీ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ఈ పండుగ సీజన్‌లో యెజ్డీ బైక్‌లను కొనుగోలు చేసే వారికి 100 శాతం ఫైనాన్స్ సదుపాయాన్ని అందిస్తోంది. దీంతో పాటు జీరో డౌన్‌పేమెంట్ వెసులుబాటును కల్పిస్తోంది. అర్హత కలిగిన వినియోగదారులు 5.99 శాతం ప్రారంభ వడ్డీ రేటుతో బైక్‌ను కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఈ ఆఫర్లతో ఒకేసారి పెద్ద మొత్తాన్ని చెల్లించకుండా బైక్ కొనాలనుకునే వారికి ప్రయోజనం కలగనుంది. అయితే ఫైనాన్స్ అర్హతలు, వడ్డీ రేటు, రుణ నిబంధనలు ఆర్థిక సంస్థను బట్టి మారవచ్చు. కొనుగోలు చేసే ముందు వర్తించే నిబంధనలను పరిశీలించాలని సూచిస్తున్నారు.

త్వరలో మార్కెట్లోకి పోకో ఎక్స్8ఎస్

-స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 ప్రాసెసర్ ఉండే అవకాశం

-12 జీబీ ర్యామ్, ఆండ్రాయిడ్ 16తో రానున్నట్లు లీకులు

-120 హెర్ట్జ్ డిస్‌ప్లే, 50 మెగాపిక్సెల్ కెమెరా ఉండొచ్చని సమాచారం



ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ పోకో నుంచి కొత్తగా ఎక్స్8ఎస్ మోడల్ విడుదలయ్యే అవకాశం ఉందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ ఫోన్ మోడల్ నంబర్ 2609జూజ5ఖీ+ థాయ్‌లాండ్‌కు చెందిన ఎన్‌బీటీసీ ధ్రువీకరణ వెబ్‌సైట్‌లో కనిపించినట్లు సమాచారం. దీంతో ఈ ఫోన్ త్వరలో మార్కెట్లోకి వచ్చే అవకాశాలపై స్మార్ట్‌ఫోన్ వినియోగదారుల్లో ఆసక్తి నెలకొంది. అయితే, ఫోన్ విడుదల తేదీ, ధర, ఇతర వివరాలపై కంపెనీ ఇప్పటివరకు అధికారిక ప్రకటన చేయలేదు. లీకుల ప్రకారం పోకో ఎక్స్8ఎస్‌లో స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 ప్రాసెసర్‌ను అందించే అవకాశం ఉంది. దీనికి 12 జీబీ ర్యామ్, ఆండ్రాయిడ్ 16 ఆపరేటింగ్ సిస్టమ్ జతకావచ్చని అంచనా. ఈ వివరాలు నిజమైతే వేగవంతమైన పనితీరుతోపాటు ఒకేసారి పలు యాప్‌లను వినియోగించుకునే వారికి ఈ ఫోన్ ఉపయోగపడే అవకాశం ఉంది. ఈ స్మార్ట్‌ఫోన్‌లో 6.83 అంగుళాల డిస్‌ప్లే, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్ ఉండవచ్చని ప్రాథమిక సమాచారం సూచిస్తోంది. అలాగే 50 మెగాపిక్సెల్ కెమెరాను కూడా అందించే అవకాశం ఉందని లీకులు పేర్కొంటున్నాయి. అయితే కెమెరా పనితీరు, బ్యాటరీ సామర్థ్యం, ఛార్జింగ్ వేగం, నిల్వ సామర్థ్యం వంటి కీలక వివరాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ప్రస్తుతం ఈ ఫోన్‌కు సంబంధించిన సమాచారం ధ్రువీకరణ వెబ్‌సైట్‌లో మోడల్ నంబర్ కనిపించడం, లీకుల ఆధారంగానే వెలుగులోకి వచ్చింది. పోకో సంస్థ అధికారికంగా ప్రకటించే వరకు ఈ ఫీచర్లను ఖరారైన వివరాలుగా పరిగణించలేం. విడుదల తేదీ, ధర, పూర్తి స్పెసిఫికేషన్లపై కంపెనీ ప్రకటన వెలువడిన తర్వాతే మరింత స్పష్టత రానుంది.

ధన్‌తేరస్ వేళ బంగారం కొంటున్నారా?

-ఆచారం కోసం కొనుగోళ్లా.. పెట్టుబడి కోసమా?

-తయారీ ఖర్చులు, ఆర్థిక పరిస్థితిని బేరీజు వేసుకోండి

-తొందరపాటు నిర్ణయాల కంటే ఆర్థిక ప్రణాళికే ముఖ్యం



ధన్‌తేరస్, దీపావళి పండుగల సమయంలో బంగారం కొనుగోలు చేయడం చాలామందికి ఆనవాయితీగా వస్తోంది. ఈ పండుగల వేళ బంగారం కొంటే శుభప్రదమని భావించి ఆభరణాలు, నాణేలు కొనుగోలు చేస్తుంటారు. అయితే పండుగ సంప్రదాయం కోసం బంగారం కొనడం, దీర్ఘకాలిక పెట్టుబడిగా కొనుగోలు చేయడం రెండూ వేర్వేరు అంశాలని గుర్తుంచుకోవాలి. కొనుగోలు చేసే ముందు తమ ఆర్థిక పరిస్థితిని, అవసరాలను అంచనా వేసుకోవడం అవసరం. బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేటప్పుడు వాటి ధరతోపాటు తయారీ ఖర్చులు, వర్తించే పన్నులను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఆభరణాలను తిరిగి విక్రయించే సమయంలో తయారీ ఖర్చుల మొత్తం తిరిగి రాకపోవచ్చు. అందువల్ల ఆభరణాల కొనుగోలును పెట్టుబడితో సమానంగా చూడకూడదు. పెట్టుబడి కోసం బంగారం కొనాలనుకునేవారు తమ లక్ష్యాలు, పెట్టుబడి కాలపరిమితి, ఇతర ఆర్థిక బాధ్యతలను పరిశీలించాలి. ఆదివారం దేశవ్యాప్తంగా బంగారం ధరలు స్థిరంగా ఉన్నట్లు సమాచారం. అయితే ధరలు స్థిరంగా ఉన్నాయనే కారణంతో వెంటనే కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. మార్కెట్ పరిస్థితులు, ధరల హెచ్చుతగ్గులు, వ్యక్తిగత ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలి. ఇతరులు కొనుగోలు చేస్తున్నారని లేదా సంప్రదాయం పాటించాలనే ఉద్దేశంతో అప్పు చేసి బంగారం కొనడం వంటి నిర్ణయాలకు దూరంగా ఉండటం మంచిది. మొత్తంగా ధన్‌తేరస్ సందర్భంగా బంగారం కొనుగోలు చేయాలనుకునేవారు తమ బడ్జెట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అత్యవసర ఖర్చులు, భవిష్యత్తు అవసరాలకు సరిపడా నిధులు ఉంచుకున్న తర్వాతే కొనుగోలు గురించి ఆలోచించాలి. పండుగ ఆనందంతోపాటు ఆర్థిక భద్రతను కూడా దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవడం శ్రేయస్కరం.

స్పోర్ట్స్

టీమిండియాకు కొత్త అస్త్రం..

-ఆల్‌రౌండర్‌గా నమన్ ధీర్ మెరుపులు!

-ఆరు బంతుల్లో 24 పరుగులతో విధ్వంసం.. బౌలింగ్‌లోనూ సత్తా

-విండీస్‌తో సిరీస్‌లో ఆకట్టుకున్న యువ ఆటగాడు





వెస్టిండీస్‌తో టీ20, వన్డే సిరీస్ ద్వారా.. టీమిండియా ఓ సరికొత్త ఆయుధాన్ని కనిపెట్టింది. అతడే నమన్ ధీర్ . బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొడుతున్న ఈ 26 ఏళ్ల సంచలనం టీమిండియాలో కీలక ఆటగాడిగా మారిపోతున్నాడు. ఆడింది తక్కువ మ్యాచులే అయినా.. తన సత్తాతో టాప్ క్లాస్ ఆటగాళ్లకు సైతం పోటీ ఇస్తున్నాడు.బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఆఖరి టీ20లో నమన్ చూపించిన హిట్టింగ్ విధ్వంసం అందరినీ ఆశ్చర్యపరిచింది. 9 ఓవర్ల మ్యాచ్‌లో సీనియర్ శివం దూబే కంటే ముందే క్రీజులోకి వచ్చిన నమన్, ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచాడు. కేమో పాల్, షమర్ స్ప్రింగర్ వంటి ఫాస్ట్ బౌలర్ల బౌలింగ్‌లో కేవలం 6 బంతుల్లోనే 3 సిక్సర్లు, 1 ఫోర్‌తో ఏకంగా 400 స్ట్రైక్ రేట్‌తో 24 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున ప్రదర్శించిన పవర్ హిట్టింగ్ సత్తాను అంతర్జాతీయ వేదికపై కూడా ప్రదర్శిస్తున్నాడు.అయితే నమన్ ధీర్ కేవలం బ్యాటింగ్‌కే పరిమితం కాలేదు. వాషింగ్టన్ సుందర్ స్థానంలో చివరి నిమిషంలో జట్టులోకి వచ్చినప్పటికీ, తన ఆఫ్‌స్పిన్ బౌలింగ్‌తోనూ అకట్టుకున్నాడు. వన్డే సిరీస్‌లో ఓవర్‌కు 6.30 రన్స్ మాత్రమే ఇచ్చి కుల్దీప్ యాదవ్ తర్వాత అత్యుత్తమ ఎకానమీ సాధించాడు. టీ20 సిరీస్‌లో విండీస్ పవర్ హిట్టర్లు అతడి బౌలింగ్‌లో సిక్సర్లు బాదినప్పటికీ, తర్వాత బంతికే వికెట్ పడగొట్టాడు. ఇలా ఐదు వికెట్లు తీశాడు. సిక్స్ పడిన తర్వాత ఒత్తిడికి గురికాకుండా వికెట్ తీసే అతడి వైఖరిని వెస్టిండీస్ హెడ్ కోచ్ డారెన్ సామీ సైతం ప్రత్యేకంగా ప్రశంసించాడు.నమన్ ధీర్ తన బౌలింగ్‌లో వేగాన్ని మార్చడంలో గొప్ప నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. 80 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో బంతులు విసురుతూ విండీస్ కుదిచేతి వాటం బ్యాటర్లను బోల్తా కొట్టించాడు. లక్నో టీ20లో షై హోప్, రొమారియో షెఫెర్డ్ వంటి డేంజరస్ బ్యాటర్లను తన స్మార్ట్ వేరియేషన్లతో పెవిలియన్ పంపాడు. మ్యాచ్ తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నప్పుడు కూడా బౌలింగ్ చేయడానికి అతడు చూపించిన ధైర్యం, ఆటిట్యూడ్‌ను భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కొనియాడాడు. ఐపీఎల్, దేశవాళీ క్రికెట్‌లో ఎంతో శ్రమించి సాధించిన అనుభవం అతడి బౌలింగ్‌లో స్పష్టంగా కనిపించింది. ప్రస్తుతం భారత జట్టులో లోయర్ ఆర్డర్‌లో వేగంగా పరుగులు సాధించే ఫినిషర్ల కొరత ఉంది. హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ సమస్యలు, శివమ్ దూబే, అక్షర్ పటేల్ ఫాస్ట్ బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు ఇబ్బంది పడుతున్న తరుణంలో నమన్ ధీర్ ఆ స్థానానికి సరైన ప్రత్యామ్నాయంగా ఎదుగుతున్నాడు. పేస్, స్పిన్ రెండింటినీ సమర్థవంతంగా ఎదుర్కోగల సత్తా నమన్ సొంతం. తాను జెన్యూన్ ఆల్‌రౌండర్‌గా మారడమే లక్ష్యమని, అయితే బ్యాటింగ్‌కు మొదటి ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశాడు. ఇటు బౌలింగ్, అటు బ్యాటింగ్ రెండింట్లోనూ రాణిస్తున్న నమన్ ధీర్ రాబోయే రోజుల్లో టీమిండియాకు అత్యంత కీలకమైన ఆస్తిగా మారతాడని క్రీడా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



హైదరాబాద్ 275 ఆలౌట్

విజయవాడ :
ఆంధ్రతో రంజీ ట్రోఫీ రెండో మ్యాచ్‌లో హైదరాబాద్ తక్కువ స్కోరుకే పరిమితం అయింది. ఆదివారం మొదలైన గ్రూప్-బీ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సిరాజ్‌సేన తొలి ఇన్నింగ్స్‌లో 275 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు అభిరథ్ రెడ్డి (67), తన్మయ్ అగర్వాల్ (42) తొలి వికెట్‌కు 109 పరుగులు జోడించి మంచి పునాది వేసినా ఈ జోడీ విడిపోయిన తర్వాత హైదరాబాద్ వరుసగా వికెట్లు కోల్పోయింది. మిడిలార్డర్‌లో రాహుల్ రాదేశ్ (58 నాటౌట్) మాత్రమే ఆకట్టుకున్నాడు. ఆంధ్ర బౌలర్లలో విజయ్ 4, లలిత్ మోహన్, సౌరభ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆతిథ్య ఆంధ్ర తొలి రోజు చివరకు వికెట్ నష్టపోకుండా 9 పరుగులు చేసింది.
గిల్ ఒక్క పరుగుకే ఔట్
న్యూజిలాండ్ పర్యటనకు ముందు పంజాబ్ జట్టు తరఫున రంజీ బరిలో నిలిచిన టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (1) నిరాశ పరిచాడు. చత్తీస్‌గఢ్‌తో మొదలైన మ్యాచ్‌లో ఐదు బంతులాడి ఒకే పరుగు చేసిన అతను లెఫ్టార్మ్ స్పిన్నర్ అజయ్ మండల్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. గిల్ ఫెయిలైనా ఉదయ్ సహరన్ (106 బ్యాటింగ్), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (62) సత్తా చాటడంతో పంజాబ్ తొలి రోజు ఆటను 269/4తో ముగించింది.

అట్టహాసంగా పారా ఆసియాడ్ ఆరంభం

ప్రారంభ వేడుకల్లో ర పత్యేక ఆకర్షణగా భారత బృందం



నగోయా (జపాన్):
ఐదో ఎడిషన్ పారా ఆసియా క్రీడలు అట్టహాసంగా మొదలయ్యాయి. ఆదివారం జరిగిన ఆరంభ వేడుకల్లో భారత క్రీడాకారులు దేశ సంస్కృతిని ప్రపంచానికి చాటారు. 5 వేల ఏండ్ల నాటి మానవ నాగరికత వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రత్యేక బ్లేజర్లను ధరించి మార్చ్‌ఫాస్ట్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు.పారా షట్లర్ ప్రమోద్ భగత్, పారా స్ప్రింటర్ సిమ్రాన్ శర్మ త్రివర్ణ పతాకాలను చేతబూని జట్టును ముందుండి నడిపించారు. భారత పారా అథ్లెట్లు ధరించిన అధికారిక బ్లేజర్‌లపై సింధు నాగరికత ముద్రలు, ప్రాచీన లిపి నమూనాలు ముద్రించారు. అలాగే కాలర్ భాగంలో సప్తసింధు నదుల ప్రాంతాన్ని స్మరిస్తూ డిజైన్ చేయగా, జేబుపై త్రివర్ణ పతాకాన్ని అలంకరించారు. ఈ క్రీడల్లో భారత్ తరఫున 11 విభాగాల్లో మొత్తం 168 మంది అథ్లెట్లు బరిలోకి దిగారు. ఈనెల 24 వరకు జరిగే ఈ మెగా గేమ్స్‌లో 45 దేశాల నుంచి సుమారు 3వేల మంది పారా అథ్లెట్లు పోటీ పడుతున్నాడు.



ప్రశాంత్ నీల్ మూవీ సరికొత్త ప్రయోగం..

-అర్ధరాత్రి ప్రీమియర్లతో ప్రేక్షకుల ముందుకు '418'!



వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పణలో తెరకెక్కుతున్న సంచలన హారర్ చిత్రం '418'. ట్రెండింగ్ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. తెలుగు తెరపై ఇప్పటివరకు ఎన్నడూ చూడని సరికొత్త కథాంశంతో, సరికొత్త భయానక వాతావరణంలో ఈ సినిమాను రూపొందించారు. హారర్ చిత్రాల జోనర్‌కు సరికొత్త నిర్వచనం ఇచ్చేలా ఈ సినిమా ఉంటుందని, థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని సినీ వర్గాల్లో గట్టి చర్చ జరుగుతోంది.అయితే ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ విడుదల చేసిన అప్‌డేట్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను క్రియేట్ చేశాయి. కాగా.. ఈ సినిమాను అక్టోబర్ 22వ తేదీన లేట్ నైట్ ప్రీమియర్లతో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. అర్ధరాత్రి సమయంలో భయానక చిత్రాలు చూస్తూ అసలైన థ్రిల్ అనుభవించాలనుకునే సినీ ప్రియుల కోసం ఈ ప్రత్యేక రాత్రి షోలను ఏర్పాటు చేయడం విశేషం. ఆ తర్వాత అక్టోబర్ 23న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది. ప్రశాంత్ నీల్ మార్క్ మేకింగ్ స్టైల్, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలు ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్తాయని, బాక్సాఫీస్ వద్ద ఇది ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అక్క' టీజర్‌తో ఆసక్తి రేపుతున్న కీర్తి సురేశ్..

-రాధికా ఆప్టేతో హోరాహోరీ పోరు!



ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు మరో ఆసక్తికరమైన వెబ్ సిరీస్ సిద్ధమవుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్ రూపొందించిన 'అక్క' టీజర్ తాజాగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇందులో కథానాయికలు కీర్తి సురేశ్, రాధికా ఆప్టే ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇద్దరు బలమైన మహిళా పాత్రల మధ్య సాగే పోరాటం ఈ సిరీస్‌పై అంచనాలను పెంచుతోంది.సాధారణంగా కమర్షియల్ కథల్లో హీరో, విలన్ మధ్య జరిగే పోరాటమే ప్రధానంగా కనిపిస్తుంది. అయితే 'అక్క' మాత్రం అందుకు భిన్నంగా ఇద్దరు శక్తిమంతమైన మహిళా పాత్రల మధ్య సంఘర్షణను ప్రధానంగా చూపించబోతున్నట్లు టీజర్ ద్వారా అర్థమవుతోంది. విభిన్న వ్యక్తిత్వాలు కలిగిన ఈ ఇద్దరి మధ్య ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? వారి మధ్య పోరుకు కారణమేంటి? అనే అంశాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.ఈ సిరీస్‌లో కీర్తి సురేశ్ మునుపెన్నడూ చూడని విధంగా ఆవేశభరితమైన పాత్రలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఆమె లుక్, హావభావాలు పాత్రలోని తీవ్రతను ప్రతిబింబిస్తున్నాయి. మరోవైపు రాధికా ఆప్టే కూడా తనదైన నటనతో ప్రత్యేకతను చాటుతున్నారు. ఇద్దరి మధ్య సాగే ముఖాముఖి సన్నివేశాలు టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.ఆసక్తికరమైన కథాంశం, బలమైన నటీనటుల ఎంపికతో 'అక్క' ఇప్పటికే ప్రేక్షకుల్లో చర్చకు దారితీసింది. ఈ వెబ్ సిరీస్ అక్టోబర్ 30 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి రానుంది. టీజర్‌లో చూపించిన సంఘర్షణను పూర్తి కథలో ఎలా ఆవిష్కరిస్తారో చూడాలి. కీర్తి సురేశ్, రాధికా ఆప్టే కలిసి తెరపై ఎలాంటి ప్రభావం చూపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. మొత్తానికి, సాధారణ కథలకు భిన్నంగా ఇద్దరు మహిళల మధ్య సాగే పోరాటాన్ని కేంద్రంగా చేసుకున్న 'అక్క' టీజర్‌తోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. విడుదల తర్వాత ఈ సిరీస్ ఎలాంటి స్పందన అందుకుంటుందో వేచి చూడాలి.

జ్ఞాపకాల వెల్లువలో హైకూ



ఏగన్, 'కోర్ట్' ఫేమ్ శ్రీదేవి, ఫెమినా జార్జ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి యువరాజ్ చిన్నసామి దర్శకత్వం వహించారు. డి.అరుళానందు, మాథ్యూ అరుళానందు నిర్మాతలు. విలేకరులో సమావేశంలో కథానాయిక శ్రీదేవి మాట్లాడుతూ..తన హృదయానికి ఎంతో దగ్గరైన చిత్రమిదని, ప్రేమలోని సంఘర్షణ, మధుర జ్ఞాపకాలను ఆవిష్కరిస్తుందని చెప్పింది. నిజాయతీతో కూడిన ప్రేమకథ ఇదని, కాలేజీ జీవితంలోని అందమైన అనుభవాల్ని చూపించారని కోన వెంకట్ తెలిపారు. తమిళంలో మాదిరిగానే తెలుగు ప్రేక్షకులు కూడా ఆదరిస్తారనే నమ్మకం ఉందని హీరో ఏగెన్ పేర్కొన్నారు.

ధర్మన్‌లో రజనీకాంత్ జోడీగా?

ఇప్పటివరకు వీరిద్దరు కలసి చంద్రముఖి, కుసేలన్, దర్బార్, అన్నాత్తే వంటి చిత్రాల్లో నటించారు. తాజా సమాచారం ప్రకారం రజనీకాంత్ తాజా చిత్రం 'ధర్మన్'లో నయనతార ఓ కీలక పాత్రను పోషించబోతున్నట్లు తెలిసింది. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో అగ్ర హీరో కమల్‌హాసన్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటున్నది.స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు.ఈ సినిమాలో నయనతారను ఓ కీలక పాత్రకోసం ఎంపిక చేశారని, కథాగమనంలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు. దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత రజనీకాంత్ చిత్రంలో నయనతార నటిస్తుండటం విశేషం. ఈ సినిమాలో సిమ్రాన్, రాశీఖన్నా, శ్రీలీల, రామ్ పోతినేని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న విషయం తెలిసిందే.



ప్రభాస్ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్..

'స్పిరిట్' నుంచి కొత్త పోస్టర్, రిలీజ్ డేట్ వచ్చేసింది

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'స్పిరిట్' (రాజాఅతీత్). ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా విడుదల చేసిన కొత్త పోస్టర్ మరియు అప్‌డేట్ సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ చిత్రంలో ప్రభాస్ ఎప్పుడూ చూడని విధంగా ఓ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించనున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో ప్రభాస్ బ్లాక్ క్యాప్, స్టైలిష్ గాగుల్స్‌తో అత్యంత రగ్డ్ అండ్ ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తూ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నారు.దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తనదైన మార్క్ యాక్షన్ అండ్ మాస్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తుండగా, ఈ మూవీపై ఇప్పటికే సినిమా సర్కిల్స్‌లో విపరీతమైన అంచనాలు నెలకొన్నాయి. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించి అభిమానులకు మెగా ట్రీట్ అందించింది. ఈ భారీ యాక్షన్ డ్రామాను 2027 దీపావళి కానుకగా అక్టోబర్ 29న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన టాలెంటెడ్ బ్యూటీ త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా, వివేక్ ఒబెరాయ్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రల్లో అలరించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు టీ-సిరీస్ మరియు భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత సందీప్ రెడ్డి వంగా నుంచి వస్తున్న సినిమా కావడంతో 'స్పిరిట్'పై అంచనాలు తారాస్థాయికి చేరాయి. సరికొత్త యాక్షన్ ప్యాక్డ్ కథాంశంతో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com